శనివారం
SATURDAY
17-10-2026

సంపుటి (Volume):2 ॥ సంచిక: (Issue): 109

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

EVARTHALU

దినపత్రిక



వెన్నముద్దల బతుకమ్మ శుభాకాంక్షలు



కార్లూ ఎగురుతాయ్!


రాకెట్ థ్రస్టర్లతో టెస్లా రోడ్‌స్టర్ విన్యాసం

ర్యాంప్‌పై తలకిందులుగా ప్రయాణించి గాల్లోకి ఎగిరిన కారు

0.81 సెకన్లలో 96.6 కి.మీ. వేగం: ఎలాన్ మస్క్



న్యూయార్క్: కార్లు రోడ్డుపైనే కాదు.. గాల్లోనూ విన్యాసాలు చేయగలవని చూపించే ప్రయత్నం చేసింది విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా. సంస్థ అధినేత ఎలాన్ మస్క్ ఆవిష్కరించిన సరికొత్త రోడ్‌స్టర్ కారు ప్రదర్శనలో భాగంగా చేసిన విన్యాసం అందరినీ ఆశ్చర్యపరిచింది. వంపుగా ఉన్న ర్యాంప్‌పై తలకిందులుగా ప్రయాణించిన కారు.. కొద్దిసేపు గాల్లోకి ఎగిరి తిరిగి సురక్షితంగా నేలపై దిగింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం మెక్‌గ్రెగర్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ కేంద్రంలో గురువారం ఈ ప్రదర్శన నిర్వహించారు. దీనికి సంబంధించిన దృశ్యాలను మస్క్ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. భవిష్యత్తులో ఎగిరే కార్లు కూడా ఉంటాయని వ్యాఖ్యానించారు. కొత్త రోడ్‌స్టర్‌లో అధిక పీడనంతో కూడిన వాయు ట్యాంక్, ప్రత్యేకంగా రూపొందిం చిన థ్రస్టర్లు ఉన్నాయని మస్క్ వివరించారు. ఈ వ్యవస లోని థ్రస్టర్లు కారు ఎత్తును నియంత్రించడంతోపాటు తరువాయి 2 వ పేజీలో...



ఎల్‌నినో ఎఫెక్ట్..

ఉమ్మడి జిల్లాలకు స్పెషలాఫీసర్లు

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా ప్రతికూల సీజనల్ పరిస్థితుల నేపథ్యంలో పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను (స్పెషల్ ఆఫీసర్లు) నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో వర్షపాతం, జలాశయాల్లో నీటి మట్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి లభ్యత, వ్యవసాయ, ఉద్యాన పంటల స్థితిగతులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు. పరిస్థితులను-2 వ పేజీలో...



హైదరాబాద్‌కు హ్యుందాయ్

సీఎం రేవంత్‌తో కంపెనీ ప్రతినిధుల భేటీ

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ ప్రతిపాదన.. 4,275 మందికి ఉపాధి అవకాశాలు

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి -2 వ పేజీలో...



ఫైర్ ఫైటర్లకు న్యాయం జరిగేనా?

జీవో 86పై కదిలిన యంత్రాంగం.. అన్ని స్థాయుల సిబ్బందితో డీజీ వీసీ

సమస్యలు విన్న ఫైర్ డీజీ విక్రమ్ సింగ్.. జీవోపై పునరాలోచన చేస్తామని హామీ!



(ఈవార్తలు – ప్రత్యేకం)
అగ్నిమాపక శాఖలో ఫైర్ ఫైటర్లు, లీడింగ్ ఫైర్‌మెన్లకు జీవో 86 వల్ల ఎదురవుతున్న సమస్యలపై 'ఈవార్తలు' ప్రచురించిన వరుస కథనాలు అధికార యంత్రాంగంలో కదలిక తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ శుక్రవారం అన్ని స్థాయుల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పదోన్నతులు, సేవా సీనియారి టీ, వేతన -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,744
వెండి (కిలో):	రూ.2,40,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,970



ఎములాడలో సంబురంగా సద్దుల బతుకమ్మ


సంప్రదాయ పాటలు, నృత్యాలతో సందడి.. వేడుకల్లో పాల్గొన్న విమలక్క, ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ

వేములవాడ అర్బన్, అక్టోబర్ 16 (ఈవార్తలు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయ బతుకమ్మ పాటలు, కోలాటాలు, నృత్యాలతో మూలవాగు పరిసరాలు సందడిగా మారాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బిగితే, ప్రముఖ గాయని విమలక్క వేడుకల్లో తరువాయి 2 వ పేజీలో...

ఐదుగురు మహిళల జలసమాధి

పెనుకొండలో పెను విషాదం.. జలాశయంలో పడి దుర్మరణం

ఆనందంగా సాగాల్సిన విహారయాత్ర .. మృత్యుశయ్యగా మారింది. ఎంతో సంతోషంగా వెళ్లిన వాళ్లు విగతజీవులుగా మారారు. ఈ పెను విషాదం ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా గొల్లపల్లి పెనుకొండలో చోటుచేసుకుంది. ఒకేసారి ఐదుగురు మహిళల ప్రాణాలు కోల్పోయారు. దీంతో దర్గాపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనుకొండ పట్టణం దర్గాపేటకు చెందిన కొంతమంది మహిళలు కలసి గొల్లపల్లి రిజర్వాయర్‌కు పిక్నిక్‌కు వెళ్లారు.



పెనుగొండ, అక్టోబర్ 16 (ఈవార్తలు): సరదాగా ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లోకి దిగారు. కానీ లోతు ఎక్కువగా ఉండడంతో ఐదుగురు మహిళలు నీటిలో మునిగిపోయారు. అయితే సమీపంలో ఉన్నవాళ్లు వారిని రక్షించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చనిపోయిన వారిలో మహీం, హసీనా, పుష్పలత, గాయత్రమ్మ, అశ్వని ఉన్నట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను బయటకు తీసి.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతోషంగా గడపాల్సిన సమయంలో ఇలా జరగడం తరువాయి 2 వ పేజీలో...

విశ్వవాణి



చికిత్సకు లొంగని మెదడు క్యాన్సర్లతో బాధపడుతున్న పిల్లలు, యువతకు రోగనిరోధక చికిత్స ద్వారా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మొత్తం 33 మంది పిల్లలు, యువకులపై తొలిదశ వైద్య పరీక్షలో భాగంగా కణితులను గుర్తించి దాడి చేసే రోగనిరోధక కణాలతో సరికొత్త చికిత్సను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ విధానంలో రోగుల రోగనిరోధక టీ కణాలకు జన్యు మార్పులు చేయకుండా, కణితుల్లో సాధారణంగా కనిపించే మూడు ప్రొటీన్లను గుర్తించగల సహజ రోగనిరోధక కణాలను వేరు చేసి, వాటి సంఖ్యను పెంచారు. అనంతరం వాటిని రక్తప్రవాహం ద్వారా శరీరంలోకి ప్రవేశపెట్టారు. ఇది ఫలితాన్ని ఇచ్చింది. అయితే, ప్రస్తుతం ఈ పరీక్షలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

ఏసీ 25 డిగ్రీలు కంటే తగ్గొద్దు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ.. 'నెట్ జీరో' బాటలో తెలంగాణ

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల (ఏసీ) ఉష్ణోగ్రతను 25 డిగ్రీల సెల్సియస్ వద్ద ప్రామాణికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను నియంత్రించడంతో పాటు ఇంధన పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ జీవో ఎంఎస్ నం. 3 పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి 'నెట్ జీరో' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్ బై 2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం అనుసరిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అమర్చే కూలింగ్ వ్యవస్థల వల్లే పీక్ అవర్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, ఇక్కడ ఉష్ణోగ్రత నియంత్రణ పాటించడం ద్వారా వెంటనే విద్యుత్‌ను ఆదా చేయవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) గతంలో ఇచ్చిన మార్గదర్శకాలు, జాతీయ-అంతర్జాతీయ విధానాలను తరువాయి 2 వ పేజీలో...





వాయుసేనకు కొత్త శాటిలైట్

ఎన్ఎస్ఐఎల్‌తో 2,563 కోట్ల డీల్

బెంగళూరు: భారత వాయుసేన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. యుద్ధ విమానాలు, గగనతల నిఘా వ్యవస్థలు, భూమిపై ఉన్న రాడార్లు, కమాండ్ కేంద్రాల మధ్య సురక్షిత సమాచార వ్యవస్థను మెరుగుపరిచే లక్ష్యంతో జీశాట్-7సీ (జీశాట్-7సీ) అనే స్వదేశీ సైనిక సమాచార ఉపగ్రహం కోసం రూ.2,563 కోట్ల డీల్ పెట్టుకుంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ.. అక్టోబర్ 15వ తేదీన బెంగళూరుకు చెందిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్)తో ఈ ఒప్పందంపై సంతకాలు తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

17.10.2026

మేషం: దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించాలి. తల్లి తరపు బందు వర్గంతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృషభం: అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. సోదరులతో సఖ్యత కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మిథునం: అనవసర వస్తువులపై ధన వ్యయం చేస్తారు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయం తీసుకోలేరు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కర్కాటకం: ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగుల కష్టం ఫలించి నూతన అవకాశాలు అందుతాయి. ఇంటా బయట మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది.

సింహం: భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కన్య: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఋణ సమస్యల నుండి బయటపడతారు. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన కార్యక్రమాల ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

తుల: పాత ఋణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. ఆదాయ మార్గాలు మెరుగుపడతాయి.

వృశ్చికం: వృత్తి ఉద్యోగాలలో మేలైన సౌకర్యాలను పొందుతారు. సమాజంలో కీర్తి గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం విద్యా విషయాలపై కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు.

ధనస్సు: బంధు మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు ఉంటాయి. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి పనులు పూర్తికావు.

మకరం: ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వ్యాపార వ్యవహారాలలో పెద్దల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మీనం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది.

ఫైర్ ఫైటర్లకు న్యాయం జరిగేనా

మొదటి పేజీ తరువాయి

ఇంక్రిమెంట్లు, హెవీ మోటార్ వెహికల్ (హెచ్ఎంవీ) లైసెన్స్ నిబంధనతో పాటు జీవో 86 అమలుతో తలెత్తిన ఇబ్బందులను సిబ్బంది డీజీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని, జీవో 86పై మరోసారి ఆలోచిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం.

సిబ్బంది అభిప్రాయాలు.. జీవోపై తీవ్ర అసంతృప్తి

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రతి జిల్లా నుంచి ఒక ఫైర్ ఫైటర్, ఒక లీడింగ్ ఫైర్‌మెన్, ఒక డివిజనల్ ఆఫీసర్ ఆఫ్ పోలీస్ (డీఓపీ) తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు సమాచారం. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో దాదాపు 98 శాతం మంది జీవో 86 వల్ల తమకు నష్టం జరుగుతోందని అభిప్రాయపడినట్లు తెలిసింది. సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు పదోన్నతులు కల్పించడంతో తమకు అన్యాయం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. 1986, 1990, 1991 బ్యాచ్‌లకు చెందిన లీడింగ్ ఫైర్‌మెన్లతో పాటు 2011, 2013, 2014, 2017, 2020, 2024 బ్యాచ్‌లకు చెందిన ఫైర్ ఫైటర్లు కూడా జీవో అమలుతో తీవ్రంగా నష్టపోతున్నామని సమావేశంలో వివరించినట్లు తెలిసింది. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నప్పటికీ తమకు రావాల్సిన పదోన్నతులు, ప్రయోజనాలు దక్కడం లేదని వారు డీజీ దృష్టికి తీసుకెళ్లారు.

రిక్రూట్‌మెంట్ సమయంలో లేని నిబంధనతో ఇబ్బందులు

తాము ఉద్యోగాల్లో చేరిన సమయంలో లేని హెచ్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనను ఇప్పుడు అమలులోకి తీసుకురావడం వల్ల తమ సీనియారిటీ, విద్యార్హతలు, అనుభవం పక్కనపడుతున్నాయని సిబ్బంది వాపోయినట్లు తెలిసింది. ఈ నిబంధన కారణంగా వేతన ఇంక్రిమెంట్లు నిలిచిపోయాయని, సర్వీసులో తమకు రావాల్సిన గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు సీనియారిటీ కోల్పోవడంతో భవిష్యత్తులో పదోన్నతుల అవకాశాలపైనా ప్రభావం పడుతోందని వివరించినట్లు సమాచారం. అగ్నిమాపక విధుల నిర్వహణలో భాగంగా బలవంతంగా డ్రైవింగ్ బాధ్యతలు అప్పగించడం వల్ల కూడా తమకు నష్టం జరుగుతోందని కొందరు సిబ్బంది పేర్కొన్నట్లు తెలిసింది. ఉద్యోగంలో చేరినప్పుడు అంగీకరించిన విధులు, నిబంధనలకు భిన్నంగా కొత్త బాధ్యతలు, అర్హతల నిబంధనలు విధించడం తమ సర్వీసుపై ప్రభావం చూపుతోందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం.

పదోన్నతి ప్రతి ఒక్కరి హక్కు.. డీజీ హామీ

సిబ్బంది వెల్లడించిన సమస్యలను విన్న డీజీ విక్రమ్ సింగ్.. పదోన్నతి అనేది ప్రతి ఒక్కరి హక్కు అని పేర్కొన్నట్లు సమాచారం. ఉద్యోగులు తమ సర్వీసులో తగిన పదోన్నతులు పొందుతూ సంతోషంగా పదవీ విరమణ చేయాలన్నదే లక్ష్యమని ఆయన చెప్పినట్లు తెలిసింది. జీవో 86 వల్ల సిబ్బందికి సమస్యలు ఎదురవుతున్నాయన్న అంశంపై మరోసారి ఆలోచించి తగిన నిర్ణయం తీసుకునే దిశగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

పోరాటంలో తొలి ముందడుగుగా సిబ్బంది భావన

గత ఏడాది కాలంగా జీవో 86పై సిబ్బంది తమ సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఫైర్ డీజీ నేరుగా వివిధ స్థాయిల సిబ్బందితో సమావేశమై వారి అభిప్రాయాలను వినడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారి సమయం కేటాయించి మాట్లాడటం తమకు దక్కిన గుర్తింపుగా సిబ్బంది భావిస్తున్నారు. అయితే, వీడియో కాన్ఫరెన్స్‌లో హామీ ఇవ్వడంతోనే సమస్యలు పరిష్కారమైనట్లు కాదని, జీవో 86పై అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదే కీలకమని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. పదోన్నతులు, సీనియారిటీ, ఇంక్రిమెంట్లు, హెచ్ఎంవీ లైసెన్స్ నిబంధనలపై స్పష్టమైన నిర్ణయం తీసుకొని, నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేసినప్పుడే తమ పోరాటానికి పూర్తి ఫలితం దక్కుతుందని వారు ఆశిస్తున్నారు.

సమిష్టి పోరాటంతోనే పరిష్కారం?

సిబ్బంది ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం న్యాయబద్ధంగా పోరాడితే ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఉద్యోగులు భావిస్తున్నారు. తాజా వీడియో కాన్ఫరెన్స్ ఈ దిశగా తొలి ముందడుగుగా కనిపిస్తున్నప్పటికీ, జీవో 86పై పునరాలోచన చేసి సిబ్బందికి వాస్తవంగా ఎలాంటి ఉపశమనం కల్పిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'ఈవార్తలు' వరుస కథనాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమస్యలను నేరుగా వినడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ స్పందన కార్యాచరణగా మారి ఫైర్ ఫైటర్లకు న్యాయం జరుగుతుందా? జీవో 86లో అవసరమైన మార్పులు చోటుచేసుకుంటాయా? అన్నది వేచి చూడాలి.

..సంబురంగా సద్దుల బతుకమ్మ

మొదటి పేజీ తరువాయి



పాల్గొనగా, సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేములవాడ మూలవాగు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు, నిమజ్జనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, ఒకరితో ఒకరు కలిసి నృత్యాలు చేస్తూ సంబరాల్లో మునిగిపోయారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేములవాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతోపాటు వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బతుకమ్మ పండుగ మహిళలను ఒకచోట చేర్చి కుటుంబ బంధాలను, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు. వేములవాడలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మను ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ వేములవాడ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడంపై అధికారులకు ఉన్న బాధ్యతను ప్రస్తావించారు. మూలవాగు వద్ద నిర్వహించిన వేడుకలకు చేసిన ఏర్పాట్లు, ప్రజలకు కల్పించిన సౌకర్యాలు, వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం గురించి మాట్లాడారు.

ఏడోద్దుల బతుకమ్మ ప్రత్యేకత

వేములవాడలో బతుకమ్మ వేడుకలకు ప్రత్యేకత ఉందని పట్టణ మహిళలు తెలిపారు. పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, మెట్టినింటి నుంచి వచ్చే మహిళలు ఇక్కడ ఏడోద్దుల బతుకమ్మను సంబరంగా జరుపుకుంటారని వివరించారు. వేములవాడలో వేడుకల్లో పాల్గొన్న అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాల్లోనూ పాల్గొంటామని చెప్పారు. పుట్టింటి అనుబంధాన్ని, కుటుంబ సభ్యుల ఆత్మీయతను గుర్తుచేసే ఈ వేడుకలు తమకు మధురమైన అనుభూతిని అందిస్తాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. సంప్రదాయాలను కొనసాగించడంతోపాటు కుటుంబ సభ్యులందరినీ కలుసుకునే అవకాశం బతుకమ్మ పండుగ ద్వారా లభిస్తోందని పేర్కొన్నారు.

ప్రముఖ గాయని విమలక్క మాట్లాడుతూ బతుకమ్మ అంటే 'బతుకు అమ్మ' అని అభివర్ణించారు. ప్రకృతి ఒడిలో పుట్టిన వివిధ రంగుల పూలతో తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ జరుపుకునే గొప్ప పండుగ ఇదని పేర్కొన్నారు. అనంతరం ఆమె సాయుధ పోరాటానికి సంబంధించిన పాటలతోపాటు బతుకమ్మ పాటలను ఆలపించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యత, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు వేములవాడలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ లోకేశ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు హ్యుందాయ్

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుందంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఐదుగురు మహిళల జలసమాధి

మొదటి పేజీ తరువాయి

బాధాకారమని ఆమె అన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇలా పిక్నిక్‌లకు వెళ్లే వాళ్లు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు.అదే విధంగా ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా పర్యాటక ప్రాంతాల్లోని చెరువులు, రిజర్వాయర్ల దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డు పెట్టాలని అధికారులను ఆదేశించారు. విహార యాత్రకు వెళ్లి మహిళలు చనిపోవడం అత్యంత బాధాకరమని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాగా ఈ ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు జలాశయం వద్దకు చేరుకున్నారు. ఒకేసారి ఐదు మృతదేహాలు పక్కపక్కనే పడి ఉన్న దృశ్యం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

కార్లూ ఎగురుతాయ్!

మొదటి పేజీ తరువాయి

నేల నుంచి పైకి లేపేందుకు సహాయపడతాయని తెలిపారు. వెనుక భాగంలో అమర్చిన అదనపు థ్రస్టర్లు గాల్లో పల్టీలు కొట్టడం వంటి విన్యాసాలకు ఉపయోగపడే అవకాశముంది. కారు విన్యాసాన్ని పూర్తి చేసి సురక్షితంగా నేలపై దిగిన అనంతరం మస్క్ స్పందిస్తూ.. 'ఇది పనిచేసింది' అని వ్యాఖ్యానించారు. టెస్లా వాహన ఇంజినీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు లార్స్ మొరావీ కూడా ఈ ప్రదర్శనపై స్పందిస్తూ.. ఎగిరే కార్లు నిజంగానే ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ సాంకేతికతతో కూడిన కారును సాధారణ రహదారులపై నడిపేందుకు చట్టపరమైన అనుమతులు ఉంటాయా? అని మీడియా ప్రశ్నించగా.. అది ప్రజలు ప్రయాణించే వీధిని బట్టి ఉంటుందని మస్క్ సమాధానమిచ్చారు. ఈ కారును వినియోగానికి అనువైనదిగా కూడా అభివర్ణించారు. అయితే, ప్రదర్శనలో చూపిన గాలిలోకి ఎగిరే సామర్థ్యం సాధారణ వినియోగదారులకు అందించే వాహనంలోనూ అందుబాటులో ఉంటుందా? దానికి ఎలాంటి భద్రతా ప్రమాణాలు వర్తిస్తాయి? అనే అంశాలపై స్పష్టత అవసరం.

వేగం.. ప్రయాణ పరిధిలో ప్రత్యేకతలు

టెస్లా మరో ప్రదర్శనలో రోడ్‌స్టర్ పనితీరును వెల్లడించింది. సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, ఈ కారు నిలిచిన స్థితి నుంచి గంటకు 60 మైళ్ల వేగాన్ని.. అంటే సుమారు 96.6 కిలోమీటర్ల వేగాన్ని.. కేవలం 0.81 సెకన్లలో అందుకోగలదు. ఒక్కసారి విద్యుత్ ఛార్జింగ్ చేస్తే సుమారు 300 మైళ్లు.. అంటే దాదాపు 483 కిలోమీటర్లు.. ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. గరిష్ఠ వేగం గంటకు 230 మైళ్లకు పైగా ఉంటుందని వెల్లడించింది. సాధారణ రోడ్‌స్టర్ రూపంలో ఇద్దరు ప్రయాణించేందుకు వీలుంటుంది. రాకెట్ థ్రస్టర్లు అమర్చిన ప్రత్యేక రూపంలో మాత్రం ఒక్కరికే స్థలం ఉంటుందని సంస్థ తెలిపింది. కారులో సంప్రదాయ పక్కదృశ్య అద్దాలు కనిపించకపోవడం, యాంత్రిక తలుపుల గొళ్ళాలు ఉండటం వంటి అంశాలు రహదారి భద్రతా నిబంధనలపై ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఈ రూపకల్పనకు సంబంధించిన పూర్తి వివరాలు, సంబంధిత అనుమతులపై స్పష్టత రావాల్సి ఉంది.

మూడు రూపాల్లో రోడ్‌స్టర్

టెస్లా ఈ కారును పెర్ఫార్మెన్స్, థ్రస్ట్, రాకెట్ అనే మూడు రూపాల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. పెర్ఫార్మెన్స్ రూపాన్ని ముందుగా రిజర్వు చేసుకోవడానికి 5,000 డాలర్లు డిపాజిట్ చేయాలి. అనంతరం పది రోజుల్లో మరో 45,000 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. థ్రస్ట్ రూపం కోసం 2.50 లక్షల డాలర్ల డిపాజిట్ అవసరం. రాకెట్ రూపాన్ని మాత్రం ఆహ్వానం పొందిన వారికి మాత్రమే అందుబాటులో ఉంచనున్నట్లు కంపెనీ తెలిపింది. టెస్లా తొలిసారిగా రోడ్‌స్టర్‌ను 2008లో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఈ మోడల్ ఉత్పత్తి 2012లో నిలిచిపోయింది. అనంతరం 2017లో మస్క్ కొత్త తరం రోడ్‌స్టర్‌ను ప్రకటించారు. అధిక వేగం, ఎక్కువ ప్రయాణ పరిధి, వేగవంతమైన త్వరణం వంటి ప్రత్యేకతలను అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ కారును ముందుగానే రిజర్వు చేసుకునేందుకు వినియోగదారులకు 50,000 డాలర్లు డిపాజిట్ చేసే అవకాశం కల్పించారు. తొలి ప్రకటన వెలువడిన దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత రోడ్‌స్టర్ మరోసారి వార్తల్లో నిలిచింది. తాజా ప్రదర్శనలో రాకెట్ సాంకేతికతతో కూడిన విన్యాసాలు ఆసక్తిని రేకెత్తించినప్పటికీ.. వాణిజ్య ఉత్పత్తి, వినియోగదారులకు వాహనాల సరఫరా, రహదారి భద్రతా అనుమతులు, వాస్తవ వినియోగంలో పనితీరు వంటి అంశాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

ఏసీ 25 డిగ్రీలు కంటే తగ్గొద్దు

మొదటి పేజీ తరువాయి

పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల ఉష్ణోగ్రత 25 డిగ్రీల కంటే తక్కువ కాకుండా చూడాలని టీజీ రెడ్కో ఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దీన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిబంధనను పాటించడం ద్వారా విద్యుత్ ఆదా కావడమే కాకుండా ఉద్యోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రత్యేక అవసరాలు ఉన్న విభాగాలకు మినహాయింపునిస్తూ, మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాధిపతులు, కలెక్టర్లు ఈ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

వాయుసేనకు కొత్త శాటిలైట్

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఈ ఉపగ్రహం అందుబాటులోకి వస్తే భారత వాయుసేనకు సుదూర ప్రాంతాల్లో పనిచేసే విమానాలు, ఇతర గగనతల వేదికలు, భూమిపై ఉన్న కేంద్రాల మధ్య సమాచారాన్ని మార్పిడి చేసుకునే సామర్థ్యం మరింత పెరగనుంది. మొత్తం సుమారు రూ.4,106 కోట్ల విలువైన రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ ఒప్పందం కుదిరింది. ఇందులో భారత నౌకాదళం కోసం వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడోల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందం కూడా ఉంది. జీశాట్-7సీ భారత వాయుసేన అవసరాల కోసం రూపొందించిన ప్రత్యేక సమాచార ఉపగ్రహం. సైనిక కార్యకలాపాల సమయంలో వివిధ విమానాలు, రాడార్ వ్యవస్థలు, కమాండ్ కేంద్రాల మధ్య సురక్షితమైన, నిరంతర సమాచార అనుసంధానాన్ని మెరుగుపరచడం దీని ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోలు (ఎస్‌డీఆర్‌లు) ద్వారా సుదూర ప్రాంతాలకు సమాచారాన్ని చేరవేయడంలో ఈ ఉపగ్రహం కీలక పాత్ర పోషించనుంది. సాధారణ రేడియో కమ్యూనికేషన్‌కు దూరం, భౌగోళిక పరిస్థితులు, భూమి వంపు వంటి పరిమితులు ఉంటాయి.



ఎల్‌నినో ఎఫెక్ట్.. ఉమ్మడి జిల్లాలకు స్పెషలాఫీసర్లు

మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొనేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేలా వీరు చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి, ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశాల్లో సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, గతంలోనే రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఆ ఉత్తర్వుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేనను నియమించగా, తాజాగా ఆ ఆదేశాలను పాక్షికంగా సవరిస్తూ డా. బి.కె. శ్రీదేవికి ఈ బాధ్యతలు అప్పగించి.. మరోసారి పూర్తి లిస్ట్ విడుదల చేసింది. ప్రత్యేక అధికారులు ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సులు సైతం నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటారు. అలాగే ఎల్‌నినో పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ మరింత పెంచింది. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు వివరాలు తీసుకుంటున్నట్లు అధికారుల సమాచారం.

హైదరాబాద్: జయేశ్ రంజన్
రంగారెడ్డి: వికాస్ రాజ్
కరీంనగర్: బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా
మెదక్: ఎ.వాణి ప్రసాద్
నిజామాబాద్: డాక్టర్ యోగితా రాణా
నల్గొండ: హరిచందన దాసరి
ఆదిలాబాద్: కె.ఇలంబరితి
వరంగల్: బి.కె. శ్రీదేవి
మహబూబ్‌నగర్: వి.పి. గౌతమ్
ఖమ్మం: అనుదీప్ దురిశెట్టి





జేపీఎల్-3 విజేతలకు బహుమతులు

యువత క్రీడల్లో రాణించాలి: అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల, అక్టోబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించిన జగిత్యాల ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా విజేత, రన్నరప్ జట్లకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ బహుమతులు అందజేశారు. టోర్నీలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ బ్యాట్స్‌మన్, బౌలర్లను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఐక్యత పెంపొందుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ వేముల నవీన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చొక్కా నవీన్‌కుమార్, షేక్ ముస్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

26న కృష్ణా బోర్డు సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి సతీశ్ కుమార్ కాంభోజ్ సమావేశ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఐదో అంతస్తులో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని బోర్డు సభ్యులందరినీ కోరారు. సెప్టెంబర్ 29న జారీ చేసిన కార్యాలయ లేఖకు కొనసాగింపుగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించిన అజెండాలో చేర్చాల్సిన అదనపు అంశాలు ఏవైనా ఉంటే ఈనెల 21లోగా తెలియజేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి, ఇంజినీర్-ఇన్-చీఫ్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంజినీర్-ఇన్-చీఫ్‌లకు సమాచారం పంపించారు. కేఆర్ఎంబీ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులకు కూడా సమావేశ వివరాలను తెలియజేశారు. కృష్ణా నది జలాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై బోర్డు సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నది.

'రణబాలి'కి కిషన్ రెడ్డి అభినందన

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన పీరియాడిక్ డ్రామా 'రణబాలి' చిత్రంపై కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. వలస పాలన నాటి అణచివేతను, రాయలసీమ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న కరవు తీవ్రతను, వారి వీరోచిత పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు ఈ చిత్రం ఆవిష్కరించిందని ఆయన కొనియాడారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను, వారి ప్రతిఘటనను వెండితెరపై ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మరుగునపడిన ఎందరో యోధుల త్యాగాలను, జానపద వారసత్వాన్ని గుర్తుచేయడంలో ఇలాంటి చిత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ మరుగునపడిన చారిత్రక అధ్యాయాలను వెలికితీయడం ద్వారా సామూహిక స్మృతులను పరిరక్షించే బాధ్యతను నిర్వర్తిస్తోందని అభినందించారు. "ఈ గొప్ప ప్రయత్నం చేసిన రాహుల్ సాంకృత్యన్, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, మైత్రీ మూవీ మేకర్స్ బృందానికి నా శుభాకాంక్షలు" అని ఆయన పేర్కొన్నారు.

మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

మేడ్చల్, అక్టోబర్ 16 (ఈవార్తలు): నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రీతిలో భూముల రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. ఈ మోసానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి కీలకమైన నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రాంతంలో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితులు ప్రధానంగా నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ పత్రాలను రూపొందించారు. వీటిని ఆధారంగా చేసుకుని జీడిమెట్ల ప్రాంతంలోని సర్వే నంబర్లు 192, 193లో గల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నిందితులు సుమారు రూ.6 లక్షల మేర వసూలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు రెండు అక్రమ రిజిస్ట్రేషన్లను వీరు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ యూఎల్‌సీ పత్రాలతో పాటు స్టాంప్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలలో ఇటీవల భూ సంబంధిత అక్రమాలు పెరుగుతున్న తరుణంలో అధికారులు నిఘాను మరింత తీవ్రతరం చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? వీరు గతంలో మరిన్ని మోసాలకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

డిండి రద్దు చేయకపోతే ఉద్యమమే: డీకే అరుణ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 16 (ఈవార్తలు): డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో పాలమూరు-రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయడం ద్వారా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు.

మెహిదీపట్నం దుర్గమ్మ గుడిలో అపశ్రుతి

గోపురంపై కోడిగుడ్లు.. భక్తుల ఆందోళన



హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): దేవీ నవరాత్రి ఉత్సవాల వేళ హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయోధ్య నగర్‌లోని శ్రీ కనకదుర్గ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసరడం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఆగ్రహించిన భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. శ్రీ కనకదుర్గ సేవా సమితి తెలిపిన వివరాల ప్రకారం, గురువారం సాయంత్రం ఆలయంలో నవరాత్రి పూజలు జరుగుతుండగా ఈ అపశ్రుతి చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణం, గోపురంతో పాటు పలుచోట్ల కోడిగుడ్లు పడి ఉండటాన్ని గుర్తించారు. పూజలో పాల్గొన్న కొందరు మహిళా భక్తులపై కూడా గుడ్లు పడినట్లు, అయితే వారు భయంతో ఆ సమయంలో విషయాన్ని బయటపెట్టలేకపోయారని ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఈ ఉదంతం పూర్తిగా వెలుగులోకి రావడంతో స్థానికంగా ఉద్రిక్తత పెరిగింది. ఈ ఘటనపై సమాచారం అందగానే శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు, హిందూ సంఘాల కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకున్నారు. "జై శ్రీరామ్", "పోలీస్ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. హిందూ సమాజం ఈ చర్యను తీవ్రంగా ఖండించాలని, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ వంటి సంస్థలు తమకు అండగా నిలవాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కుల్సుంపురా ఏసీపీ వి. తిరుపతి ఇతర అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో ఆలయం బయటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు గుడ్లు విసిరినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ప్రాథమికంగా గుర్తించినట్లు ఏసీపీ వెల్లడించారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంపై ఇటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడటం క్షమించరానిదని, నిందితులను త్వరలోనే గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు సంయమనం పాటించాలని, వదంతులను నమ్మవద్దని కోరారు. పవిత్రమైన నవరాత్రి రోజుల్లో ఆలయాన్ని అపవిత్రం చేయడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

మొదలైన సన్‌రైజర్స్ కావ్యా పాప పెళ్లి సందడి

సీఎం రేవంత్‌కు కళానిధిమారన్ దంపతుల ఆహ్వానం



హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): గత కొంతకాలంగా దక్షిణాది సినీ, వ్యాపార వర్గాల్లో హాట్ టాపిక్‌గా నలుగుతున్న వార్తకు బలం చేకూరింది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటి కాబోతున్నారు. ఈ వార్తలపై ఇప్పటివరకు ఇరు కుటుంబాల నుంచి అధికారిక ప్రకటన రానప్పటికీ, పెళ్లి పనులు వేగంగా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. అనిరుధ్, కావ్య మారన్‌ల వివాహం నవంబర్ 11న గ్రీస్‌లో జరుగుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, ఆయన భార్య కావేరి మారన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. నవంబర్ 21వ తేదీన చెన్నైలో జరగనున్న తమ కుమార్తె కావ్య మారన్-అనిరుధ్ రవిచందర్‌ల వివాహ రిసెప్షన్‌కు హాజరుకావాల్సిందిగా వారు సీఎం రేవంత్ రెడ్డి దంపతులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ ఆహ్వానంతో రిసెప్షన్ తేదీపై స్పష్టత వచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత స్టాలిన్ వంటి ప్రముఖులకు కూడా కళానిధి మారన్ స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించనున్నారని సమాచారం. ఈ పరిణామంతో, త్వరలోనే మారన్ కుటుంబం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.



చిరుజల్లుల్లో శ్రీవారి చిద్విలాసం

తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

తిరుమల, అక్టోబర్ 16 (ఈవార్తలు): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారు ప్రత్యేకమైన లక్ష్మీకాసుల హారంతో అలంకృతులై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికలో టీఆర్ఎస్ పోటీ: కవిత

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

గాదె సాయికృష్ణ కేసు సీబీఐకి బదిలీ

ఏపీ హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాక బాధితుడి తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. కొన్ని నాన్-బెయిలబుల్ వారెంట్ల కేసులో 25 ఏళ్ల సాయికృష్ణను 2026 మే నెలలో మార్కాపురం సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోగా, ఆ తర్వాత అతని ఆచూకీ గల్లంతైంది. దీంతో సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరిపి, మే 6 నుంచి 8 మధ్య కస్టడీలో జరిగిన చిత్రహింసల వల్లే సాయికృష్ణ మరణించినట్లు నిర్ధారించింది. అక్రమ నిర్బంధం, సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ చేయడం, మృతదేహాన్ని రహస్యంగా మాయం చేయడం వంటి ఆరోపణలతో అప్పటి సీఐతో సహా పలువురు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసి, చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. అయితే, రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని సాయికృష్ణ తల్లితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గదల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



దుర్గమ్మకు చంద్రబాబు పట్టువస్త్రాలు

విజయవాడ, అక్టోబర్ 16 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో జంగిల్ రాజ్ పాలన: జగన్



తాడేపల్లి, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో దాడి జరిగిందంటూ ఆ పార్టీ అధినేత జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తూ పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వెళుతున్న వైసీపీ అభ్యర్థులను, నాయకులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు వైసీపీ వర్గాలు ఆరోపించాయి.

నూకపల్లి కాలనీలో అన్ని సదుపాయాలు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ.. రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

జగిత్యాల, అక్టోబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కాలనీలో రూ.2.77 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఉపకేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని చెప్పారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని అర్హులైన కుటుంబాలు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. కాలనీలోని అన్ని మతాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవాలయం, మసీదు, చర్చి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య పరిష్కారానికి మొబైల్ టవర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ప్రజల రవాణా సౌకర్యం కోసం బస్సు సర్వీసును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యుత్, రవాణా, సమాచార సదుపాయాలతోపాటు ఇతర మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపకేంద్రం నిర్మాణంతో కాలనీవాసులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని చెప్పారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల అధికారులు, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి రూ.20 లక్షలు

నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో మసీదు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ తెలిపారు.



నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనంగా మరో రూ.50 లక్షలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంఐఎం నాయకుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మసీదు నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ సమీర్ ఆజాద్, కౌన్సిలర్ మహమ్మద్ రజీఉద్దీన్, ప్రధాన కార్యదర్శి నౌమాన్, షేక్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు. మసీదు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు సమీర్ ఆజాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల ఎంఆర్ఓ, గృహ నిర్మాణ శాఖ ఏఈ, మున్సిపల్ కమిషనర్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రూరల్ ఎస్సై, మున్సిపల్ చైర్‌పర్సన్, నూకపల్లి అర్బన్ కాలనీ అధ్యక్షుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పంటలు వేయొద్దనడం సిగ్గుచేటు

కాంగ్రెస్ వల్లే రైతులకు కష్టాలు

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 16 (ఈవార్తలు): యాసంగి పంటలు వేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు చెప్పడం సిగ్గుచేటని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేమి కారణంగానే రైతులు ప్రస్తుత కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం నాలుగు గంటలే అందుతోందని రవిశంకర్ ఆరోపించారు. విద్యుత్ కోతల కారణంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని, ఇందుకు అదనంగా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చవుతోందని తెలిపారు. విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలు దెబ్బతింటున్నాయని, రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత, గోదావరి నదులు సమీపంలో ఉన్నప్పటికీ నీటి వనరుల వినియోగానికి సరైన ప్రణాళిక లేకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించకపోవడం వల్ల సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, సాగునీటి సమస్యలను పరిష్కరించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా మెరుగుపడకపోతే సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: భోగ శ్రావణి

జగిత్యాల, అక్టోబర్ 16 (ఈవార్తలు): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పని భారాన్ని తగ్గించడంతోపాటు వారికి వర్తించే అలవెన్సులు అందించాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాసెట్టి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో కాయకింగ్, కెనోయింగ్‌ను చేర్చాలి

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులకు అసోసియేషన్ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): డిసెంబర్‌లో జరగనున్న ఖేలో ఇండియా పోటీల్లో రోయింగ్‌తోపాటు కాయకింగ్, కెనోయింగ్ క్రీడలను కూడా చేర్చాలని కాయకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాల దేవి (ఐఏఫ్ఎస్), రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ మొదట విడుదల చేసిన పోటీల జాబితాలో కాయకింగ్, కెనోయింగ్ క్రీడలు ఉన్నప్పటికీ, కొందరు అధికారుల ఒత్తిళ్ల కారణంగా తర్వాత వాటిని తొలగించారని ఆరోపించారు. ప్రాచుర్యం పొందిన ఈ జలక్రీడలను కావాలనే పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఐదో ఖేలో ఇండియా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు వెండి, కాంస్య పతకాలు సాధించారని గుర్తుచేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లోనూ ఈ క్రీడల్లో



క్రీడాకారులు పతకాలు సాధించినట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక జలక్రీడల పాఠశాల ఉన్నప్పటికీ, ఖేలో ఇండియా పోటీల్లో తమ క్రీడలకు అవకాశం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు నిరాశకు గురవుతున్నారని చెప్పారు. క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వానికి నిధుల కొరత ఉందని, ఈ క్రీడల నిర్వహణకు సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. సీఎం కప్‌లో విజేతలైన క్రీడాకారులకు నగదు బహుమతులు అందించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు భూపాల్, అనిల్ రాజ్, జానీ, క్రీడాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చన

జగిత్యాల, అక్టోబర్ 16 (ఈవార్తలు): ఆశ్వయుజ మాస షష్ఠి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేసి, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. పారాయణం అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, ముడుపులు కట్టారు. కుంకుమ పూజల అనంతరం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ఒకరికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలతో అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు వొద్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు జ్యోతి, స్వప్న, లక్ష్మి, లత, అనూష్మ, గంగమ్మ, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఆర్‌పీఐ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మి

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా లక్కం రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో వ్యవస్థాపకుడు, జాతీయ చైర్మన్ మహమ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో చాలామంది సామాన్యులకు తమ హక్కులపై పూర్తిస్థాయి అవగాహన లేదన్నారు. తమకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించడం, వాటిని ఎవరికి తెలియజేయాలి, పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలి అనే విషయాల్లో అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించడం, న్యాయపరమైన అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి మార్గదర్శకత్వం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణలో సంస్థను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి సన, జాతీయ కార్యవర్గ సభ్యురాలు రమ్యశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ, మీడియా కార్యదర్శి బోయిని ప్రసాద్, సంయుక్త కార్యదర్శి గీట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP
DASARA SPECIAL OFFER
Launch Your Cloud-Hosted ePaper Today
Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support
ePaper Pro దసరా శుభాకాంక్షలు
20% OFF ON EVERY PLAN
NEWS ONLY website · web stories · breaking news
Standard 5 GB · 5 users SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR
Expanded 10 GB · 10 users SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR
Full Press 15 GB · 30 users SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR
ePAPER ONLY PDF to Interactive ePaper
Standard 5 GB · 5 users SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR
Expanded 10 GB · 10 users SAVE 20%
✓ Android app & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR
Full Press 15 GB · 30 users SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR
NEWS + ePAPER the complete digital newspaper
Standard 5 GB · 5 users SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR
Expanded 10 GB · 10 users SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR
Full Press 15 GB · 30 users BEST VALUE
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR
PLATFORM HIGHLIGHTS
Smart AI image extraction · One-click publishing · Real-time analytics
AdSense & sponsor ad slots · WhatsApp sharing · AWS cloud - daily backups
Custom domain + auto SSL · AI tagging & SEO tags · YouTube Video embedding
Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication
CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com
SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

కాక్రోచ్ ధర్నాలతో భారీ వ్యాపార నష్టం

పరిహారం కోరుతూ రెస్టారెంట్ వ్యాపారి పిటిషన్.. 27న విచారణ జరపనున్న ఉన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం కన్నాట్ ప్లేస్‌లో అనధికారిక నిరసనలు, ఆందోళనల కారణంగా వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటిని నియంత్రించవలసిందిగా కోరుతూ ఒక రెస్టారెంట్ యజమాని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నిరసనల వల్ల సంభవించిన ఆర్థిక నష్టాలకు బాధ్యులైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. కన్నాట్ ప్లేస్‌లోని ఒక రెస్టారెంట్ భాగస్వామి ఆయుష్ చోప్రా, తన న్యాయవాది ఉమంగ్ త్యాగి ద్వారా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఇదే తరహా వ్యాజ్యంపై గురువారం ఒక ఉత్తర్వు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై అక్టోబర్ 27న విచారణ జరుపుతామని పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సమావేశం కావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, సెంట్రల్ పార్క్ నిరసనలకు నిర్దేశించిన ప్రాంతం కాదని, పండుగ సీజన్‌లో ఇక్కడ ఆందోళనలు నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతింటాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10న సీజేపీ నిర్వహించిన ఆందోళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ వారు నిరసన చేపట్టారని, తత్ఫలితంగా కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలను మూసివేయాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ఒక్కరోజే కన్నాట్ ప్లేస్‌లో రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు, ఢిల్లీ వ్యాప్తంగా సుమారు రూ. 2,000 కోట్ల మేర వ్యాపారం నష్టపోయిందని వ్యాపార సంఘాల అంచనాలను పిటిషనర్ ఉటంకించారు. ఈ ఆందోళనల వల్ల నవరాత్రుల సమయంలోనూ తన రెస్టారెంట్ వ్యాపారం గణనీయంగా పడిపోయిందని ఆయుష్ చోప్రా తెలిపారు. నిరసన తెలిపే హక్కుకు, వ్యాపారం చేసుకునే ప్రాథమిక హక్కుకు మధ్య సమతుల్యత ఉండాలని పిటిషనర్ వాదించారు. సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ, నిరసనలు ఎక్కడపడితే అక్కడ కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే జరగాలని కోరారు. అలాగే అక్టోబర్ 10 నాటి ఆందోళనకు బాధ్యులైన వారి నుంచి వ్యాపారులకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్, న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ), ఢిల్లీ ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చారు. కాగా, ఇదే అంశంపై గురువారం జరిగిన విచారణ సందర్భంగా, సీజేపీ కార్యకలాపాలను చట్టపరంగా నియంత్రిస్తామని ఢిల్లీ పోలీసులు హైకోర్టుకు హామీ ఇచ్చారు.

విమాన చార్జీలపై నియంత్రణ!

కేంద్రం కీలక ముందడుగు.. వాయుయాన్ అధినియమ్ నిబంధనలకు ఆమోదం



న్యూఢిల్లీ: దేశంలో విమాన ఛార్జీల నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. భారత విమానయాన రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన "భారతీయ వాయుయాన్ అధినియమ్-2024" చట్టం కింద రూపొందించిన నిబంధనలకు పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. రాబోయే రెండు వారాల్లో ఈ నిబంధనలను నోటిఫై చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. శుక్రవారం జరిగిన విచారణలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనానికి ఈ వివరాలను వెల్లడించారు. నిబంధనలను ఇప్పటికే ఖరారు చేసినట్లు ఆయన కోర్టుకు వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, నోటిఫై చేసిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను నవంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. విమానయాన రంగంలో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు స్వతంత్ర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలను, అనుబంధ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచకుండా నియంత్రించేందుకు పటిష్ఠమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. బ్రిటిష్ కాలం నాటి 'ఏయిర్‌క్రాఫ్ట్ యాక్ట్-1934' స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ "భారతీయ వాయుయాన్ అధినియమ్-2024"ను తీసుకువచ్చింది. విమానాల డిజైన్, తయారీ, నిర్వహణ, వినియోగం, అమ్మకాలు, ఎగుమతి, దిగుమతి వంటి అన్ని కీలక అంశాలను పర్యవేక్షించేందుకు ఈ చట్టం ఒక ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కల్పిస్తుంది. ఈ ముసాయిదాను సుప్రీంకోర్టుకు కేంద్రం ఇటీవలే అందించింది. గతంలో జరిగిన విచారణల సందర్భంగా, ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల్లో విమాన ఛార్జీలు అమాంతం పెరగడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే కొత్త చట్టం కింద నిబంధనల రూపకల్పనను వేగవంతం చేస్తున్నామని కేంద్రం కోర్టుకు హామీ ఇచ్చింది. తాజా పరిణామాలతో అస్థిరమైన విమాన ఛార్జీల సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు ఆశిస్తున్నారు.

దీప్కే నేహా బోరా అరెస్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'తిరంగా యాత్ర' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన అరెస్ట్ అయిన కొద్ది నిమిషాలకే, ఈ నిరసనలో పాల్గొనేందుకు వెళుతున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాను, ఇతర వామపక్ష కార్యకర్తలను మండి హౌస్ వద్ద పోలీసులు నిర్బంధించారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్ట్‌కు నిరసనగా అభిజీత్ దీప్కే ఈ 'తిరంగా అసెంబ్లీ'కి పిలుపునిచ్చారు. కన్నాట్ ప్లేస్ వద్దకు చేరుకుని జాతీయ జెండాను ఎగరేయాలని ఆయన ప్రజలను కోరారు. అయితే, ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అనుమతి లేదని, ఆ ప్రాంతంలో ఇప్పటికే నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని తెలుపుతూ ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఉదయం దీప్కేకు రెండు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అరెస్టులపై సీజేపీ అధికార ప్రతినిధి మెహర్ పర్వీచా స్పందిస్తూ, "జాతీయ జెండాను ఎక్కడ ఎగరేయాలో నిర్ణయించుకునే హక్కు మాకుంది. దానిపై ఎవరూ ఆంక్షలు విధించకూడదు. కేవలం జెండాను ప్రదర్శించినందుకే మా ఇద్దరు సహచరులను జంతర్ మంతర్ వద్ద అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయినప్పటికీ మేము వెనక్కి తగ్గబోం" అని అన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం సెంట్రల్ పార్క్ వద్ద నిషేధాజ్ఞలు ఉన్నాయని పోలీసులు జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా, గతంలో విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నప్పుడు, ఏడాది పాటు ఎలాంటి ప్రజా అశాంతికి కారణం కాబోమని దీప్కే, ఆయన సహచరులు కోర్టు ఎదుట హామీ పత్రం (బాండ్ డౌన్) ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా పోలీసులు తమ నోటీసులో గుర్తుచేశారు.

యాపిల్ ఫోల్డబుల్ ఫోన్ ప్రీ-బుకింగ్స్ షురూ

ముంబై: ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్, ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న తన మొట్టమొదటి ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. "ఐఫోన్ డ్యుయో" పేరుతో వస్తున్న ఈ కొత్త తరం ఫోన్ ప్రీ-ఆర్డర్లు శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 23 నుంచి ఇవి అధికారికంగా అమ్మకానికి రానున్నాయి. ఈ ఫోన్‌తో యాపిల్ సంస్థ, అత్యంత పోటీ ఉన్న ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లో అధికారికంగా అడుగుపెట్టింది. యాపిల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటిగా ఐఫోన్ డ్యుయో నిలిచింది. దీని ధరలు వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. వివిధ వేరియంట్ల ధరల వివరాలు పరిశీలిస్తే.. 256జీబీ వేరియంట్: రూ. 2,99,900, 512జీబీ వేరియంట్: రూ. 3,24,900, 1టీబీ వేరియంట్: రూ. 3,74,900, 2టీబీ వేరియంట్: రూ. 4,49,900గాఉన్నాయి. ఇంత అధికంగా ఉన్నప్పటికీ, ఈ ఫోన్ పట్ల వినియోగదారుల్లో విశేష ఆసక్తి కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6 మిలియన్ యూనిట్లు అమ్ముడయ్యే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. యాపిల్ ఆన్‌లైన్ స్టోర్, అధీకృత రిటైల్ భాగస్వాములు, ప్రముఖ ఆఫ్‌లైన్ అవుట్‌లెట్ల ద్వారా కస్టమర్లు ఈ ఫోన్‌ను ప్రీ-బుక్ చేసుకోవచ్చు.

అందరూ జర్నలిస్టులే అయితే సమస్యే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ప్రతి పౌరుడూ తనను తాను జర్నలిస్ట్ అని చెప్పుకోవడం మొదలుపెడితే, అది అందరికీ ఇబ్బందులు సృష్టిస్తుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేసిన ఫ్రీలాన్సర్లు, స్వతంత్ర జర్నలిస్టులు, రీల్స్ చేసేవారికి రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదిస్తూ.. ఫ్రీలాన్స్, స్వతంత్ర జర్నలిస్టులను ఢిల్లీ పోలీసులు గుర్తించడం లేదని, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. మీడియా సంస్థలు జారీ చేసిన ఐడీ కార్డులు ఉన్న జర్నలిస్టుల విధులకు ఆటంకం కలగకుండా జాతీయ స్థాయిలో ఒక ప్రోటోకాల్ రూపొందించాలని కోరారు. ఈ సమయంలో సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ "ప్రతి ఒక్కరూ జర్నలిస్టుగా మారితే ఎలాంటి సమస్యలు వస్తాయో కూడా మనం ఆలోచించాలి" అని హెచ్చరించారు. ఆర్టికల్ 19 ప్రకారం భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరుడికీ జర్నలిస్ట్ అయ్యే హక్కును ఇస్తుందా? అనే దానిపై లోతైన పరిశీలన అవసరమని జస్టిస్ బాగ్చీ అభిప్రాయపడ్డారు. గుర్తింపు పొందిన, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ చేసేవారికి వేర్వేరు స్థాయుల్లో రక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ సోషల్ మీడియా పాప్యులారిటీ కోసం రీల్స్ చేస్తూ తమను తాము స్వతంత్ర జర్నలిస్టులుగా చెప్పుకుంటున్నారని తెలిపారు. మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరగకుండా రక్షణ కల్పించడాన్ని సమర్థిస్తూనే, అదే రక్షణ మహిళా పోలీసు సిబ్బందికి కూడా వర్తించాలని అన్నారు. వివిధ వర్గాల జర్నలిస్టులకు అదనపు రక్షణ కల్పించే అంశంపై సమగ్ర విచారణ జరపాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. నిరసనల సమయంలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులు, వేధింపుల ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, స్వతంత్ర విచారణ అవసరాన్ని పరిశీలిస్తామని సూచించింది.

పుతిన్‌పై తిరుగుబాటు..!

సొంత సైన్యంపైనే రష్యా అధికారి దాడి

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఒక సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. రష్యా సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న 26 ఏళ్ల అధికారి, పుతిన్ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకతతో తన మాతృదేశానికే వెన్నుపోటు పొడిచారు. ఉక్రెయిన్ నిఘా వర్గాలకు రహస్యంగా సైనిక సమాచారం అందించి, సుమారు 300 మందికి పైగా రష్యన్ సైనికుల మరణానికి కారణమయ్యారు. అనంతరం యుద్ధరంగం నుంచి చాకచక్యంగా తప్పించుకుని, ప్రస్తుతం ఉక్రెయిన్ పక్షాన రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. వివరాల్లోకి వెళితే, లెఫ్టినెంట్ జెవ్ స్టూప్నికోవ్ రష్యా సైన్యంలో చీఫ్ సిగ్నల్స్ ఆఫీసర్‌గా సేవలందించేవారు. డాన్‌బాస్ ప్రాంతంలోని కీలకమైన పుహ్లేదర్‌ను స్వాధీనం చేసుకోవాల్సిన బెటాలియన్‌లో ఆయన పనిచేసేవారు. ఈ హోదాలో ఆయనకు సైనికుల కదలికలు, యుద్ధ వ్యూహాలు, డ్రోన్ల ఫీడ్స్, నిఘా కెమెరాల సమాచారం వంటి కీలక వివరాలన్నీ తెలిసేవి. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని తీవ్రంగా వ్యతిరేకించిన స్టూప్నికోవ్, ఆ సమాచారాన్ని రహస్యంగా ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్‌కు చేరవేశారు. ఒకరోజు ఉదయం కడుపునొప్పిగా ఉందని నటిస్తూ తన సహచర సైనికుల నుంచి ఆయన దూరంగా వెళ్లారు. కొద్దిసేపటికే ఆయన పంపిన కోఆర్డినేట్ల ఆధారంగా ఉక్రెయిన్ క్షిపణి దాడులకు దిగింది.

పిల్లలకు 'సోషల్' భద్రత ఉండాల్సిందే

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు.

ఆభరణాల ఎగుమతులపై డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లు తగ్గింపు

ముంబై: బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఇతర విలువైన లోహ ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం 'డ్యూటీ డ్రాబ్యాక్' రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ రోజు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో నగల ఎగుమతిదారుల లాభాలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. తాజా సవరణ ప్రకారం.. బంగారం ఆభరణాల ఎగుమతిపై డ్యూటీ డ్రాబ్యాక్ గ్రాముకు రూ. 1,851.99 నుంచి రూ. 1,794.11కి తగ్గింది. ఇది సుమారు 3.1 శాతం కోత. ఇక వెండి ఉత్పత్తుల విషయంలో ఈ తగ్గింపు మరింత ఎక్కువగా ఉంది. వెండి ఆభరణాలు, ఇతర వస్తువుల ఎగుమతిపై కిలోగ్రాముకు రూ. 29,501.09గా ఉన్న రేటును రూ. 26,859.02కి తగ్గించారు. ఇది దాదాపు 9 శాతం తగ్గింపును సూచిస్తోంది. ఎగుమతి చేసే వస్తువుల తయారీకి ఉపయోగించే ముడిసరుకులపై చెల్లించిన కస్టమ్స్, ఇతర సుంకాలను ఎగుమతిదారులకు తిరిగి చెల్లించే విధానాన్నే 'డ్యూటీ డ్రాబ్యాక్' అంటారు. అంతర్జాతీయ మార్కెట్లో భారత ఉత్పత్తుల పోటీతత్వాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ఈ ఏడాది జులైలో ప్రభుత్వం నగల ఎగుమతి రంగానికి ఊరటనిస్తూ డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లను భారీగా పెంచింది. అప్పట్లో బంగారం ఆభరణాలపై రిఫండ్‌ను గ్రాముకు రూ. 773.17 నుంచి రూ. 1,851.99కి, వెండిపై కిలోకు రూ. 14,990.66 నుంచి రూ. 29,501.09కి పెంచింది. ప్రస్తుత రేట్ల తగ్గింపు నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లో డిమాండ్ బలంగా కొనసాగితే ఎగుమతులపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

జెలెన్‌స్కీ మంచోడు కాదు: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో వ్యవహరించడానికి సరైన వ్యక్తి కాదని, రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అతనితో చర్చలు జరపడమే కష్టంగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ ప్రజలు మరో నాయకుడిని ఎన్నుకుంటే మంచిదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ మళ్లీ దాడులు ప్రారంభించడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను అవమానకరంగా ఆయన అభివర్ణించారు. శాంతి కావాలని పైకి చెబుతూనే, జెలెన్‌స్కీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి ఇంధనం అవసరమైన తరుణంలో రిఫైనరీలపై దాడులు చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఇంధన కాల్పుల విరమణ' ఒప్పందాన్ని రష్యా గౌరవించలేదని ఉక్రెయిన్ ఆరోపించింది. విరామ సమయంలోనూ రష్యా తమ ఇంధన వ్యవస్థలపై దాడులు కొనసాగించిందని, అందుకే తాము తిరిగి దాడులు ప్రారంభించాల్సి వచ్చిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దాడులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామాల నడుమ, ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఆయిల్ రిఫైనరీపై దాడి చేయగా, భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు, మధ్య ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తారస్థాయికి చేరాయి.

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కసరత్తు

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది.

స్టార్‌లింక్‌తో పోటీకి సై

మేం భయపడం.. మస్క్ వ్యాఖ్యలకు రిలయన్స్ కౌంటర్

ముంబై: ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల్లో స్టార్‌లింక్ సహా ఏ సంస్థతోనైనా పోటీకి సిద్ధంగా ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. భారతీయ, విదేశీ సంస్థలన్నింటికీ దేశంలో ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు ఎదురవుతున్న నియంత్రణపరమైన అడ్డంకులపై ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన నేపథ్యంలో రిలయన్స్ ఈ ప్రకటన చేసింది. భారత్‌లో పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలను స్వాగతించే వాతావరణం ఉందని రిలయన్స్ పేర్కొంది. అయితే దేశ చట్టాలు, విధానాలకు లోబడి ప్రతి సంస్థ పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత ప్రభుత్వ విధానం ప్రకారం దేశీయ, విదేశీ సంస్థలకు ఒకే విధమైన ప్రక్రియ వర్తిస్తుందని తెలిపింది. జియో ఉపగ్రహ సేవలకు సైతం ఇంకా అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించింది. పోటీకి తాము ఎప్పుడూ భయపడలేదని, వినియోగదారులకు మెరుగైన సేవలు ఎవరు అందిస్తున్నారో నిరూపించుకునేందుకు పోటీనే సరైన పరీక్ష అని రిలయన్స్ పేర్కొంది. 2016లో టెలికాం రంగంలోకి అడుగుపెట్టినప్పుడు జియోకు ఒక్క వినియోగదారుడు కూడా లేడని గుర్తుచేసింది. పదేళ్లలో 53 కోట్లకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించామని, ప్రపంచంలోనే అత్యంత అందుబాటు ధరల్లో డేటా సేవలను, మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని తెలిపింది.

సర్కారును పడగొట్టే కుయుక్తులు

సర్ నిరసనలపై రాజ్‌నాథ్ ఆరోపణలు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై బీజేపీ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తోంది. బంగ్లాదేశ్ తరహాలో ప్రభుత్వాన్ని పడగొట్టడమే ఈ నిరసనకారుల అసలు లక్ష్యమని ఆరోపించింది. సీనియర్ న్యాయవాది, నిరసనకారుల బృందానికి చెందిన ప్రశాంత్ భూషణ్ గురువారం ఆ ఆరోపణలను బహిరంగంగానే అంగీకరించారు. దీనిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలతో నిరసనకారుల 'అజెండా ఏంటో స్పష్టమైంది' అని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. గురువారం సాయంత్రం వామపక్ష విద్యార్థి విభాగం ఏఐఎస్ఏ ప్రెసిడెంట్ నేహా బోరా, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. "అవును, మేము ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నాం' అని స్పష్టం చేశారు. 'ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తంచేయడం నేరం కాదని, ఇప్పుడు జరుగుతున్న పోరాటం నిజంగానే పాలన మారడం కోసం' అని భూషణ్ వ్యాఖ్యానించారు."ప్రభుత్వం మారాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది... మేము ప్రస్తుతం ఎన్నికలు సరిగ్గా జరిగేలా చూడటానికే పోరాడుతున్నాం. కానీ ఈ టి దౌర్జన్యం ఇలాగే కొనసాగితే ఖచ్చితంగా ప్రభుత్వం మారుతుంది. అవును, మేమంతా ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నాం" అని ఆయన ప్రకటించారు. నిరసనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్షాల అజెండా దేశంలో అరాచకాన్ని సృష్టించడమేనని ఆరోపించారు. శుక్రవారం లక్నోలో మాట్లాడిన రాజ




లయకారి చిత్రం



విద్యాబాలన్ ఐరన్ లెగ్ ముద్ర పాయే!


తొలిసారి మలయాళంలో మోహన్ లాల్ సరసన చక్రం అనే సినిమాకు సంతకం చేసిన విద్యాబాలన్‌కు దక్షిణాదిన కష్టాలు తప్పలేదు. నిర్మాణంలో సమస్యలు తలెత్తడంతో ఆ సినిమా మధ్యలోనే ఆగిపోయింది. దాంతో మలయాళం ఇండస్ట్రీలో ఈమెకు ఐరన్ లెగ్ అని పేరు పెట్టారు. చేసేదేమీ లేక తమిళం పై తన దృష్టి పెట్టింది. 2002లో రన్ అనే సినిమాలో ఈమెను హీరోయిన్గా ఎంపిక చేసుకున్నారు. ఆ తర్వాత ఈమెను తప్పించి, మీరాజాస్మిన్ తో రీప్లేస్ చేశారు. అలాగే మనసెల్లం అనే సినిమాలో కూడా ఈమెను తీసుకొని , ఆ తర్వాత త్రిష కృష్ణన్ తో రీప్లేస్ చేశారు. ఇన్ని చాన్సులు కోల్పోయినా..ఆమె ప్రయత్నాలు మాత్రం ఆగిపోలేదు. మళ్లీ ఎన్నో తంటాలు పడి 2003లో కలారి విక్రమన్ అనే సినిమా పూర్తి చేసినా.. అది విడుదలకు నోచుకోలేదు. ఇలా కెరియర్ ప్రారంభంలోనే ఎన్నో కష్టాలు పడింది. సౌత్ లో నటించిన సినిమాలు ఏవి కూడా విడుదలకు నోచుకోలేదు. అలాగని సైన్ చేసిన చిత్రాలు ఈమె వరకు రాలేదు. దాంతో చేసేదేమీ లేక సౌత్ ఇండస్ట్రీని వదిలి 2005లో పరిణీత అని చిత్రంతో హిందీ రంగ ప్రవేశం చేసింది. అది పర్వాలేదు అనిపించుకోవడంతో సంజయ్ దత్ సరసన లగే రహో మున్నాభాయ్ అనే సినిమాలో జాహ్నవి పాత్రతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఆ తర్వాత భూల్ భులయ్య , ఇష్కియా, కిస్మత్ కనెక్షన్ , పా ఇలా పలు చిత్రాలు చేసిన ఈమె ది డర్టీ పిక్చర్ తో తిరుగులేని ఆదరణ సొంతం చేసుకుంది.దాదాపు 20 ఏళ్ల తర్వాత సౌత్ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా నటించి బ్లాక్ బస్టర్ విజయం అందుకున్న జైలర్ సినిమా సీక్వెల్ జైలర్ 2 లో కాంత అనే పవర్ఫుల్ పాత్ర పోషించింది. కొత్తలో ఐరన్ లెగ్ అని ముద్ర వేయించుకున్న ఈమె.. ఇప్పుడు గోల్డెన్ లెగ్‌గా మారడం గమనార్హం.

'రియాలిటీ'లో దేవిక భట్



ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ'తో ప్రేక్షకులను అలరించిన యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇప్పటికే నటుడిగా, నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు తన కెరీర్‌లో ఒక పెద్ద అడుగు వేయబోతున్నారు. ఈ మేరకు మొదటిసారిగా మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. 'రియాలిటీ' అనే డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాతో ఆయన డైరెక్టర్‌గా పరిచయం కానుండటంతో సినిమాపై అప్పుడే మంచి బజ్ ఏర్పడింది. గ్రామీణ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సాయికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక దేవిక భట్ హీరోయిన్‌గా నటిస్తుందంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా క్లారిటీ ఇస్తూ క్యూట్ పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. ''రియాలిటీ'తో ఇదే అసలైన వాస్తవం.. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి అందమైన దేవిక భట్‌కు స్వాగతం. డిసెంబర్ 25న వీరు ఇద్దరూ వెండితెరపై మెరిసి, ఈ క్రిస్మస్‌ను మరింత వినోదాత్మకంగా మార్చబోతు న్నారు' అంటూ పంచుకున్న పోస్టర్ నెట్టింట క్యూట్ క్యూట్‌గా వైరల్ అవుతున్నది.

నన్ను నేను నిరూపించుకునే సినిమా: సాయి పల్లవి



నేచురల్ బ్యూటీ సాయి పల్లవి త్వరలోనే 'రామాయణ' వంటి అత్యంత భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రం రాబోయే దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సాయి పల్లవి తాజాగా 'జయమ్ము నిశ్చయమ్మురా సీజన్-2' టాక్ షోలో పాల్గొని, తన కెరీర్ తొలినాళ్లలోని చేదు తీపి అనుభవాలను పంచుకున్నారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షోలో.. 'మీ జీవితంలో జయమ్ము నిశ్చయమ్మురా అనిపించిన ప్రత్యేక సంఘటన ఏది?' అని సాయి పల్లవిని ప్రశ్నించారు. దానికి ఆమె రియాక్ట్ అవుతూ.. తన డాన్స్ కెరీర్ ప్రారంభంలో ఒక ప్రముఖ డాన్స్ రియాలిటీ షో వేదికపై ఓడిపోయానని, కానీ సరిగ్గా అదే స్టేజ్‌పై కొన్నాళ్ల తర్వాత ప్రభుదేవా మాస్టర్ కొరియోగ్రఫీలో తాను 'రౌడీ బేబీ' పాటకు డాన్స్ చేయడం జీవితంలో మర్చిపోలేని మలుపు అని చెప్పారు. ఓటమి ఎదురైన చోటే తనను తాను నిరూపించుకుని, అంతటి గొప్ప స్థాయికి చేరుకోవడాన్ని తన నిజమైన విజయంగా భావిస్తానని ఆమె తెలిపారు. కేవలం అదృష్టం ఉంటేనే విజయం వస్తుందంటే తాను నమ్మనని సాయి పల్లవి స్పష్టం చేశారు. మనం పడే కష్టమే మనల్ని సరైన స్థానంలో నిలబెడుతుందని, కష్టపడి పనిచేస్తే సక్సెస్ అనేది వెతుక్కుంటూ ఆటోమేటిక్‌గా వస్తుందని చెప్పారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని సాయి పల్లవి వెల్లడించారు.

అనుభూతే నాకు పెద్ద రెమ్యునరేషన్: యామి గౌతమ్




2026లో బాక్సాఫీస్ రికార్డులన్నింటినీ తిరగరాస్తూ రూ. 1,000 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోయిన చిత్రం 'ధురంధర్: ది రివెంజ్'. రణ్‌వీర్ సింగ్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టించింది. ఈ క్రేజీ మూవీ సక్సెస్ వెనుక ఎన్నో విశేషాలు ఉండగా.. ముఖ్యంగా ఇందులో డైరెక్టర్ భార్య, ప్రముఖ నటి యామి గౌతమ్ చేసిన స్పెషల్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. పాకిస్థాన్ గడ్డపై దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రహస్యంగా పనిచేసే అండర్‌కవర్ ఇండియన్ ఏజెంట్ 'షాజియా బానో' నర్సు పాత్రలో యామి అద్భుతంగా నటించింది. అయితే ఈ సినిమాలో చిన్న అతిథి పాత్ర చేయడం కోసం ఆమె కోట్లలో రెమ్యునరేషన్ తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ షోలో పాల్గొన్న యామీ గౌతమ్ అసలు నిజం బయటపెట్టారు. ఆ రోల్ కోసం తాను భారీ చెక్కు తీసుకున్నానని చాలామంది అనుకున్నారని, కానీ ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెట్టలేమని స్పష్టం చేశారు. తన భర్త ఆదిత్య స్వయంగా తన దగ్గరకు వచ్చి 'సినిమాలో గుడ్ లక్ కోసం నువ్వు తప్పకుండా ఆ ఫ్రేమ్‌లో ఉండాలి' అని కోరిన విధానం తనను ఎంతగానో కదిలించిందని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ దర్శకులలో ఒకరైన తన భర్త చేతిలో డైరెక్ట్ చేయించుకోవడం, ఆ అరుదైన అనుభూతిని పొందడమే తాను అందుకున్న అసలైన పారితోషికం అని యామి ఎమోషనల్ అయ్యారు. డబ్బు కంటే భర్తతో పంచుకున్న ఆ సృజనాత్మక సంతృప్తే తనకు చాలా గొప్పదని చెప్పుకొచ్చారు.

హీరోయిన్లు అడిగితే ఖాసా


ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత కాలంగా నటీనటుల పని గంటలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. షూటింగ్ సెట్స్‌లో నటీనటులు.. ముఖ్యంగా హీరోయిన్లు 8 గంటల షిఫ్ట్ వర్క్ డిమాండ్ చేయడంపై పరిశ్రమలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో -దృశ్యం 3- సినిమాలో కీలక పాత్రలో నటించిన నటి ఇషితా దత్తా ఈ వివాదంపై స్పందించారు. స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణే మద్దతుగా నిలిచారు. -కల్కి 2898 ఏడీ- సీక్వెల్ ప్రాజెక్ట్‌ల నుంచి దీపికా పడుకోణే తప్పుకోవడానికి ఎనిమిది గంటల షిఫ్ట్ డిమాండ్ కూడా ఒక కారణమనే వార్తలు వచ్చాయి. దీనిపై ఇండస్ట్రీలో హాట్ డిబేట్ నడుస్తుండగా ఇషితా దత్తా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. షూటింగ్‌లో 8 గంటల షిఫ్ట్ కోరడం ఎంతమాత్రం అసమంజసమైన డిమాండ్ కాదన్నారు. 'ఒక నటి ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలని కోరినప్పుడు.. ప్రొడక్షన్ హౌస్ దానికి అంగీకరించకపోవడం వారి వ్యక్తిగత.. బిజినెస్ ఛాయిస్ కావచ్చు. ఆ డిమాండ్‌ను తప్పుగా చూపిస్తూ సదరు నటిని చిన్నచూపు చూడటం .. అవమానించడం సరైన పద్ధతి కాదు. రోజుకు 12 నుండి 15 గంటలు పనిచేయడానికి సిద్ధంగా ఉండే నటీనటులు చాలామంది ఉండొచ్చు. కానీ తక్కువ సమయం కేటాయించాలనుకునే వారి నిర్ణయాన్ని తక్కువ చేసి మాట్లాడకూడద'న్నారు.



విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్



ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాలను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 5, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.



వీరూ కొడుకు విధ్వంసం

వినూ మన్కడ్ ట్రోఫీలో ఆర్యవీర్ మెరుపులు

143 బంతుల్లో 173 పరుగుల భారీ సెంచరీ

భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ వారసుడిగా క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆర్యవీర్ సెహ్వాగ్, తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న వినూ మన్కడ్ ట్రోఫీలో (అండర్-19 వన్డే టోర్నమెంట్) ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్, విధ్వంసకర సెంచరీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగి పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 143 బంతుల్లో 19 బౌండరీలు, 8 సిక్సర్ల సహాయంతో 173 పరుగుల భారీ స్కోరు సాధించి, తన తండ్రి దూకుడైన బ్యాటింగ్ శైలిని గుర్తుచేశాడు. 18 ఏళ్ల ఆర్యవీర్ ఇటీవలే భారత అండర్-19 జట్టు తరఫున కూడా అరంగేట్రం చేసి ఆకట్టుకున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 109 పరుగులు చేసి మంచి ప్రతిభ కనబరిచాడు. వినూ మన్కడ్ ట్రోఫీలో ఢిల్లీ జట్టు 'గ్రూప్-ఈ'లో చివరి స్థానంలో ఉన్నప్పటికీ, ఆర్యవీర్ ఒక్కడే ఒంటరి పోరాటం చేస్తూ జట్టులో మెరుస్తున్నాడు. వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు కావడంతో ఆర్యవీర్‌పై సహజంగానే అంచనాలు, ఒత్తిడి ఎక్కువగా ఉంటాయి. అయితే, తన ఆటతీరుతో వాటిని అధిగమిస్తూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. గతంలో తన కొడుక్కి ఇచ్చిన సలహా గురించి సెహ్వాగ్ మాట్లాడుతూ, "ఆర్యవీర్‌ను చూసి గర్వపడుతున్నాను. ఒత్తిడి ఉంటుందని నాకు తెలుసు, కానీ దాని గురించి ఆలోచించకుండా స్వేచ్ఛగా ఆడమని చెప్పాను. నిన్ను నువ్వు మైదానంలో ఆవిష్కరించుకో, పెద్ద స్కోర్ల గురించి చింతించకు. స్వేచ్ఛగా ఆడితే పరుగులు అవే వస్తాయని సలహా ఇచ్చాను" అని తెలిపాడు. కాగా, ఈ టోర్నమెంట్‌లో దిగ్గజాల వారసులు అదరగొడుతున్నారు. మరో లెజెండరీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ కూడా కర్ణాటక అండర్-19 జట్టు తరఫున అద్భుతంగా రాణిస్తున్నాడు. అతను కూడా ఒక సెంచరీ, అలాగే కేవలం 41 బంతుల్లో 85 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి అందరి ప్రశంసలు అందుకున్నాడు. దీంతో ఇప్పుడు అందరి చూపు ఈ యువతరం ఆటగాళ్లపైనే ఉంది.

అర్ష్‌దీప్ స్థానంలో భువీ ఎంట్రీ

వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ముందు టీమిండియాలో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ గాయపడటంతో, అతని స్థానంలో అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి చేర్చినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. సిరీస్ లో చివరిదైన ఈ ఐదో మ్యాచ్ కు కీలక ప్రాధాన్యత ఉంది. ఈ పోరులో గెలిచిన జట్టు సిరీస్ విజేతగా నిలుస్తుంది. ప్రస్తుతం టీమిండియా, విండీస్ 2-2తో సమవుజ్జీలుగా నిలిచాయి. ఈ సమయంలో భువనేశ్వర్ కుమార్ వంటి సీనియర్ బౌలర్ రాక జట్టులో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోంది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ భుజానికి (కుడిచేతి వాటం బౌలర్ అయితే కుడి భుజం, ఎడమచేతి వాటం అయితే ఎడమ భుజం) గాయమైంది. ప్రస్తుతం అతను వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. గాయం తీవ్రతను అంచనా వేస్తున్నామని, అతని కోలుకునే తీరును బట్టి శనివారం బెంగళూరులో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌లో ఆడే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా సెలక్షన్ కమిటీ భువనేశ్వర్ కుమార్‌ను స్క్వాడ్‌లోకి ఎంపిక చేసింది. ఒకవేళ అర్ష్‌దీప్ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోతే, భువనేశ్వర్ తుది జట్టులో ఆడే అవకాశాలున్నాయి. ఈ సిరీస్‌లో చివరిదైన ఐదో టీ20 మ్యాచ్ అక్టోబర్ 17న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది.



వెస్టిండీస్‌తో ఐదో టీ20కి భారత జట్టు:

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన్ ధిర్, భువనేశ్వర్ కుమార్.



భారత్ అద్భుత విజయం

స్మృతి మంధాన కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌ని విజయంతో ఆరంభించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీసలోని ఆరంభ మ్యాచ్‌లో గెలుపొంది భారత మహిళల జట్టు బోణీ చేసింది. స్మృతి మంధాన కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌ని విజయంతో ఆరంభించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీసలోని ఆరంభ మ్యాచ్‌లో గెలుపొంది భారత మహిళల జట్టు బోణీ చేసింది.

బౌలర్ల ఆధిపత్యం సాగిన ఈ మ్యాచ్‌లో దీప్తి శర్మ (37 బంతుల్లో 8 ఫోర్లతో 49), అరంగేట్ర నిక్కీ ప్రసాద్ (35 బంతుల్లో 6 ఫోర్లతో 39 నాటౌట్) పట్టుదలగా ఆడారు. జింబాబ్వే బౌలర్ల ధాటికి 19/4 స్కోరుతో టాపార్డర్ కుప్పకూలిన వేళ భారత జట్టును ఈ జోడీ ఆదుకుంది. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 4 వికెట్లతో నెగ్గి 1-0తో ముందంజ వేసింది. ముందుగా జింబాబ్వే 20 ఓవర్లలో 5 వికెట్లకు 114 పరుగులు చేసింది. షర్నే మేయర్స్ (43 నాటౌట్), కెలిస్ ఎన్‌డ్లోవు (42) మాత్రమే రాణించారు. నందనికి 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 15.4 ఓవర్లలో 6 వికెట్లకు 116 పరుగులు చేసి గెలిచింది. గ్వాంజురకు మూడువికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దీప్తి నిలిచింది.

రాయ్‌పూర్ వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో భారత మహిళల జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో కెలిస్ ఎండ్‌లోవు (44 బంతుల్లో 42), షార్నే మేయర్స్ (33 బంతుల్లో 43 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో నందిని శర్మ రెండు వికెట్లు పడగొట్టగా.. షెఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి తలా వికెట్ సాధించారు. అనంతరం 115 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు జింబాబ్వే రైటార్మ్ స్పిన్నర్ నిషా గ్వాంజురా బిగ్ షాకిచ్చింది. కెప్టెన్ స్మృతి మంధానతో పాటు షెఫాలీ వర్మ, అనుష్కశర్మ(4)లను ఆరంభంలోనే నిషా గ్వాంజురా పెవిలియన్‌కు పంపింది. మాజీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా కేవలం ఒక్క పరుగు చేసి ఔటయ్యింది. దీంతో భారత్ కేవలం 19 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (49), అరంగేట్ర బ్యాటర్ నికి ప్రసాద్ (39 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఫలితంగా ఈ స్వల్ప లక్ష్యాన్ని ఉమెన్ ఇన్ బ్లూ 15.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేధించింది.





జింబాబ్వే: ఎన్‌డ్లోవు (బి) అరుంధతి 42, బిజా (ఎల్బీ) క్రాంతి 0, ముపచిక్వ (సి అండ్ బి) శ్రీచరణి 16, మేయర్స్ (నాటౌట్) 43, గ్వాంజుర (స్టంప్) రిచా (బి) నందని 9, మవుంగ (స్టంప్) రిచా (బి) నందని 0, టిరిపానో (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 114/5. వికెట్ల పతనం: 1-7, 2-60, 3-82, 4-113, 5-113. బౌలింగ్: క్రాంతి 2-0-16-1, నందని 4-0-11-2, షఫాలీ 3-0-20-0, దీప్తి 4-0-22-0, అరుంధతి 3-0-30-1, శ్రీచరణి 4-0-14-1.

భారత్: మంధాన (సి) మకుష (బి) గ్వాంజుర 9, షఫాలీ (సి అండ్ బి) గ్వాంజుర 4, అనుష్క (సి) ఎన్‌డ్లోవు (బి) గ్వాంజుర 4, హర్మన్ (సి) గ్వాంజుర (బి) మవుంగ 1, నిక్కీ (నాటౌట్) 39, దీప్తి (సి) మేయర్స్ (బి) చారే 49, రిచా (సి) గ్వాంజుర (బి) బిజా 7, అరుంధతి (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 15.4 ఓవర్లలో 116/6. వికెట్ల పతనం: 1-14, 2-18, 3-19, 4-19, 5-101, 6-110; బౌలింగ్: మకుష 1.4-0-19-0, గ్వాంజుర 3-0-18-3, మవుంగ 3-1-19-1, చిపరె 1-0-10-0, చారె 3-0-23-1, బిజా 4-0-27-1.

దుబాయ్‌లో సూర్యకుమార్ భారీ పెట్టుబడి



టీమిండియాకు 2026 టీ20 ప్రపంచకప్ అందించిన కెప్టెన్, స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ దుబాయ్‌లో విలాసవంతమైన నివాసాన్ని కొనుగోలు చేశాడు. తన భార్య దేవిషా శెట్టితో కలిసి ఉన్న ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి, ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నాడు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పేరుతో నిర్మించిన 'షారుఖ్జ్ రెసిడెన్సెస్' అనే అల్ట్రా లగ్జరీ ప్రాపర్టీలో సూర్య ఈ ఇంటిని కొన్నాడు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ.. "నేను మొదటిసారి 2014లో ఐపీఎల్ ఆడేందుకు దుబాయ్ వచ్చాను. ఆ తర్వాత 2020లో కూడా వచ్చాను. ఇప్పుడు చూస్తే, యావత్ భారతదేశం దుబాయ్ వస్తోంది. ఇక్కడ లగ్జరీ, జీవన ప్రమాణాలు చాలా భిన్నంగా ఉంటాయి. ముంబైలో నేను నివసించే చోట భద్రత ఉంది, కానీ దుబాయ్‌లోని భద్రత కూడా చాలా బాగుంటుంది. ఇక్కడికి వచ్చినప్పుడు చాలా రిలాక్స్‌డ్‌గా, సంతోషంగా అనిపిస్తుంది" అని వివరించాడు. షారుఖ్ ఖాన్ ప్రాజెక్ట్‌లో ఇల్లు కొనడంపై ప్రత్యేకంగా స్పందించాడు. "షారుఖ్ సర్ పేరుతో ఇక్కడ ఒక బిల్డింగ్ కడుతున్నారని వినగానే, మరో ఆలోచన రాలేదు. ఇందులో ఇంటీరియర్ వర్క్, క్వాలిటీ అద్భుతంగా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా లాంజెవిటీ, వెల్‌నెస్ సెంటర్ ఉండటం నాకు బాగా నచ్చింది" అని సూర్యకుమార్ తెలిపాడు. ఈ రెసిడెన్షియల్ ప్రాపర్టీలో హైపర్‌బారిక్ ట్రీట్‌మెంట్, రెడ్ లైట్ థెరపీ, క్రయోథెరపీ వంటి అత్యాధునిక ఆరోగ్య సౌకర్యాలు ఉన్నాయని ఆ వీడియోలో పేర్కొన్నాడు. "ఇక్కడ మరో విషయం గమనించాను. రక్త పరీక్ష లేకుండానే శరీరంలోని షుగర్ లెవెల్స్ నుంచి ఏ టు జెడ్ అన్నీ తెలుసుకోవచ్చు. ఇది చాలా అద్భుతం" అని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. కాగా, ఈ ఏడాది ఆరంభంలో సూర్యకుమార్ భార్య దేవిషా ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో రూ. 7.18 కోట్లతో ఓ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. గోద్రెజ్ స్కై టెర్రసెస్ భవనంలో వారు కొన్న మూడో అపార్ట్‌మెంట్ ఇది. ఒకవైపు ఆస్తుల కొనుగోలుతో సూర్యకుమార్ వార్తల్లో నిలుస్తుండగా, మరోవైపు అతని కెరీర్ ఆసక్తికరంగా మారింది. 2026లో భారత్‌కు టీ20 ప్రపంచకప్ అందించినప్పటికీ, ప్రస్తుతం సూర్య పొట్టి ఫార్మాట్ జట్టులో స్థానం కోల్పోయాడు. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించడం అప్పట్లో భారత క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కివీస్‌తో పోరుకు భారత జట్టు ప్రకటన

గిల్, శ్రేయస్ నేతృత్వంలో టీంలు ఎంపిక

టెస్టుల్లోకి పంత్ పునరాగమనం

న్యూజిలాండ్‌తో త్వరలో జరగనున్న సుదీర్ఘ పర్యటన కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. టీ20 సిరీస్ ముగిసిన అనంతరం ఇరు జట్ల మధ్య ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లు జరగనున్నాయి. ఈ పర్యటనలో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. టెస్టు సిరీస్‌తో పాటు, వన్డే సిరీస్‌లోని తొలి మూడు మ్యాచ్‌లకు గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసక్తికరంగా, వన్డే సిరీస్‌కు రెండు వేర్వేరు జట్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే సిరీస్‌కు ఎంపికయ్యారు. గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. అయితే, అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది.



తొలి మూడు వన్డేలకు భారత జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌పై ఆధారపడి), కుల్దీప్ యాదవ్.

4, 5వ వన్డేలకు భారత జట్టు:

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

టెస్టు సిరీస్‌కు భారత జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్, ఫిట్‌నెస్‌పై ఆధారపడి), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
శనివారం 17-10-2026, జగిత్యాల
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

ఆర్థిక దూకుడు.. ధరల బాదుడు!

దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు తీస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పాలకులు గర్వంగా ప్రకటిస్తున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నాయని, పరిశ్రమలు విస్తరిస్తున్నాయని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నారు. దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెబుతున్నారు. కానీ ఈ అభివృద్ధి వెలుగుల మధ్య సామాన్యుడి బతుకు మాత్రం ధరల భారంతో సతమతమవుతోంది. ఒకవైపు ఆర్థిక ప్రగతి అంటూ ఉత్సాహపరిచే ప్రకటనలు.. మరోవైపు నిత్యావసరాల ధరలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్లు! దేశ ఆర్థికాభివృద్ధి గురించి జరుగుతున్న ప్రచారానికీ, ప్రజల నిత్యజీవితంలో కనిపిస్తున్న వాస్తవానికీ మధ్య ఉన్న అంతరాన్ని ఈ పరిస్థితి ప్రశ్నిస్తోంది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడం దేశానికి అవసరమే. స్థూల దేశీయోత్పత్తి పెరగడం, ఉత్పత్తి రంగం విస్తరించడం, పెట్టుబడులు రావడం, ఉపాధి అవకాశాలు పెరగడం అభివృద్ధికి సూచికలు. అయితే ఈ వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకూ అందుతున్నాయా? పెరుగుతున్న ఆదాయానికి అనుగుణంగా ప్రజల కొనుగోలు శక్తి మెరుగుపడుతోందా? కుటుంబాల ఖర్చులు పోను కొంతైనా పొదుపు చేసుకునే పరిస్థితి ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికినప్పుడే ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది. గణాంకాల్లో దేశం ఎదుగుతున్నా, ఇంటి ఖర్చులు భరించలేక ప్రజలు అప్పుల బాట పడితే ఆ ప్రగతిని సమగ్రంగా అంచనా వేయాల్సిందే. ఒక సామాన్య కుటుంబం రోజువారీ జీవితాన్ని పరిశీలిస్తే ద్రవ్యోల్బణం ప్రభావం ఎంత లోతుగా ఉంటుందో అర్థమవుతుంది. కూరగాయలు, పప్పులు, వంటనూనె, పాలు, బియ్యం వంటి ఆహార పదార్థాల నుంచి విద్యుత్తు బిల్లులు, వంటగ్యాస్, రవాణా ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య సేవల వరకు ప్రతి అవసరానికీ డబ్బు వెచ్చించాల్సిందే. వీటిలో ఏ ఒక్క ఖర్చునూ పూర్తిగా పక్కన పెట్టలేని పరిస్థితి. ధరలు పెరిగినప్పుడు ఆదాయం అదే స్థాయిలో ఉంటే కుటుంబాలు తమ అవసరాలను తగ్గించుకోవాల్సి వస్తుంది. పోషకాహారంపై కోత పెట్టడం, వైద్యాన్ని వాయిదా వేయడం, పిల్లల చదువుల కోసం అప్పు చేయడం వంటి పరిస్థితులు తలెత్తుతాయి. ఇవి కేవలం ఆర్థిక సమస్యలు కావు.. కుటుంబాల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే పరిణామాలు. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం లేని రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, చిన్న రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ధరల పెరుగుదల భారాన్ని ఎక్కువగా మోస్తారు. వారి ఆదాయం ప్రతిరోజూ ఒకేలా ఉండదు. పనులు దొరికిన రోజే సంపాదన ఉంటుంది. కానీ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు వారి కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఉద్యోగులకూ వేతనాల పెరుగుదల ధరల పెరుగుదలకు సరిపోకపోతే చేతిలో మిగిలే మొత్తం తగ్గుతుంది. సంపాదన పెరిగినట్లు కనిపించినా, ఖర్చుల తర్వాత మిగిలే ఆదాయం కుంచించుకుపోతుంది. ఈ వ్యత్యాసమే సామాన్యుడి ఆర్థిక అస్థిరతకు కారణమవుతోంది. దేశ ఆర్థిక ప్రగతిని స్థూల దేశీయోత్పత్తి ఒక్కటితోనే కొలవలేం. ఆ వృద్ధి ఎన్ని ఉద్యోగాలను సృష్టించింది? కొత్తగా ఏర్పడిన ఉపాధి ద్వారా ఎంతమందికి స్థిరమైన ఆదాయం లభిస్తోంది? చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంతగా బలపడుతున్నాయి? వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల ఆదాయాలు పెరుగుతున్నాయా? యువతకు చదువుకు తగిన ఉద్యోగాలు లభిస్తున్నాయా? ఈ అంశాలన్నీ సమానంగా ముఖ్యమైనవే. ఉత్పత్తి పెరిగినా ఉపాధి అవకాశాలు ఆశించిన స్థాయిలో పెరగకపోతే, ఆదాయాలు కొద్దిమంది వర్గాలకే ఎక్కువగా చేరితే ఆర్థిక వృద్ధి సమాజంలోని ప్రతి కుటుంబానికీ భరోసా ఇవ్వలేదు. అదే సమయంలో ధరల పెరుగుదలను కేవలం మార్కెట్ వ్యవహారంగా పరిగణించి ప్రభుత్వాలు చేతులు దులుపుకోలేవు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఉత్పత్తిపై పడే ప్రభావం, రవాణా వ్యయాలు వంటి అనేక అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి. ప్రతి ధర పెరుగుదలకూ ఒకే కారణం ఉండదు. అందుకే సమస్యను లోతుగా విశ్లేషించి, ఏ రంగంలో ఎలాంటి చర్యలు అవసరమో గుర్తించాలి. నిల్వలు, సరఫరా, మార్కెట్ ధరలు, మధ్యవర్తుల పాత్రపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే చర్యలుంటే వాటిని అడ్డుకోవాలి.

భారత్‌పై బహుముఖ దాడి

ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఎదగాలన్న అమెరికా ఆకాంక్షకు భారత్ ఎదుగుదల సవాలుగా మారుతున్న వేళ.. వాణిజ్యం నుంచి సాంకేతికత వరకు, అంతర్జాతీయ రాజకీయాల నుంచి డిజిటల్ సమాచార వ్యవస్థల వరకు అనేక రంగాల్లో కొత్త ఒత్తిళ్లు కనిపిస్తున్నాయి. ఒకవైపు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, వాణిజ్య విధానాలతో ఇతర దేశాలపై ఒత్తిడి పెంచుతుంటే.. మరోవైపు ఎలాన్ మస్క్ వంటి సాంకేతిక దిగ్గజాలు ఉపగ్రహ అంతర్జాలం, కృత్రిమ మేధ, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచ సమాచార వ్యవస్థలపై అపారమైన ప్రభావాన్ని చూపుతున్నారు.

ఈ పరిణామాలను విడివిడిగా కాకుండా, భారత్ జాతీయ ప్రయోజనాల కోణంలో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే, ట్రంప్, మస్క్‌లు కలిసి భారత్‌ను విధ్వంసం చేయడానికి కుట్ర పన్నుతున్నారనే ఆరోపణను నిర్ధారించే ఆధారాలు లేకుండా దాన్ని వాస్తవంగా ప్రకటించలేం. కానీ వారి విధానాలు, వ్యాపార ప్రయోజనాలు, భారత్‌పై చూపగల ప్రభావాలను ప్రశ్నించడం మాత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత అవసరం. దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై అప్రమత్తంగా ఉండటం అనుమానాస్పదం కాదు.. బాధ్యత. ట్రంప్ రాజకీయ విధానంలో సుంకాలు ప్రధాన ఆయుధంగా మారాయి. అమెరికా మార్కెట్ ప్రాధాన్యాన్ని ఉపయోగించుకుని ఇతర దేశాల నుంచి వాణిజ్యపరమైన రాయితీలు పొందాలన్నది ఆయన విధానంలో కనిపించే ధోరణి. భారత్ వంటి భారీ జనాభా, విస్తృత వినియోగదారుల మార్కెట్, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంపై ఇటువంటి ఒత్తిళ్లు ప్రభావం చూపకుండా ఉండవు. అమెరికా సుంకాల ప్రభావం భారతీయ ఎగుమతులపై పడితే పరిశ్రమలు, ఉపాధి, చిన్న వ్యాపారాలు, రైతుల ఆదాయంపై పరోక్ష ప్రభావాలు ఏర్పడవచ్చు. మరోవైపు అమెరికాతో వాణిజ్య సంబంధాలు భారత ఆర్థిక వ్యవస్థకూ కీలకమే. అందువల్ల పరస్పర ప్రయోజనాల ఆధారంగా చర్చలు జరపడం అవసరం. కానీ ఆర్థిక సంబంధాల పేరుతో దేశ విధాన స్వాతంత్ర్యాన్ని తాకట్టు పెట్టడం మాత్రం ప్రమాదకరం. భారత్ ఏ దేశానికీ వ్యతిరేకంగా వ్యవహరించాల్సిన అవసరం లేదు. అదే సమయంలో ఏ దేశ ఒత్తిడికీ తలొగ్గాల్సిన అవసరమూ లేదు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా, ప్రత్యామ్నాయ మార్కెట్లను అభివృద్ధి చేసుకుంటూ, స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడమే దీర్ఘకాలిక పరిష్కారం.




ఎలాన్ మస్క్ ప్రభావం కేవలం కార్ల తయారీ లేదా అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాదు. ఉపగ్రహ అంతర్జాల సేవలు, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో ఆయన వ్యాపార సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నాయి. ఈ రంగాల్లో సాంకేతిక సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంత ముఖ్యమో, వాటి నిర్వహణపై నియంత్రణ ఎవరికి ఉందన్నది కూడా అంతే ముఖ్యం. భారత్‌లో డిజిటల్ సేవలు విస్తరిస్తున్న కొద్దీ సమాచార భద్రత, వ్యక్తిగత వివరాల రక్షణ, దేశీయ సంస్థల పోటీతత్వం, కీలక మౌలిక సదుపాయాలపై నియంత్రణ వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. విదేశీ సంస్థల సాంకేతికతను ఉపయోగించుకోవడం తప్పు కాదు. కానీ కీలక సేవల విషయంలో ఒకే సంస్థపై అధికంగా ఆధారపడితే భవిష్యత్తులో విధానపరమైన, ఆర్థికపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఉపగ్రహ అంతర్జాలం మారుమూల ప్రాంతాలకు అనుసంధానాన్ని అందించగలదు. కృత్రిమ మేధ పరిశ్రమలకు కొత్త అవకాశాలను తెచ్చిపెట్టగలదు. అదే సమయంలో ఈ సేవలపై ఆధారపడే దేశాలకు వాటి ధరలు, సేవల కొనసాగింపు, సమాచారం భద్రత, నియంత్రణ వ్యవస్థలపై స్పష్టమైన హామీలు అవసరం. సాంకేతిక సౌకర్యాల పేరుతో దేశీయ విధాన నిర్ణయాలపై ప్రైవేటు సంస్థలకు అసాధారణమైన ప్రభావం ఏర్పడకుండా ప్రభుత్వాలు జాగ్రత్త పడాలి.

నేటి ప్రపంచంలో సమాచారమే శక్తి. సామాజిక మాధ్యమాల్లో ఏ వార్త ఎక్కువ మందికి చేరాలి? ఏ అంశంపై ప్రజల దృష్టి నిలవాలి? ఏ అభిప్రాయాలు విస్తృతంగా వ్యాపించాలి? వంటి విషయాలపై డిజిటల్ వేదికల సాంకేతిక వ్యవస్థలు ప్రభావం చూపగలవు. ఈ ప్రభావం ప్రజాస్వామ్య చర్చల నుంచి వాణిజ్య నిర్ణయాల వరకు విస్తరించే అవకాశం ఉంది. అయితే, ఒక వ్యక్తి లేదా సంస్థ భారత్‌లో ఉద్దేశపూర్వకంగా అశాంతి సృష్టిస్తోందని చెప్పాలంటే నిర్దిష్టమైన ఆధారాలు అవసరం. అదే సమయంలో విదేశీ డిజిటల్ వేదికల విధానాలు, సమాచార నిర్వహణ, వినియోగదారుల వివరాల వినియోగంపై పారదర్శకత కోరడం ప్రతి దేశానికీ సమంజసమైన హక్కు. భారత్ తన పౌరుల సమాచారాన్ని రక్షించుకోవాలి. తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనే వ్యవస్థలను బలోపేతం చేయాలి. డిజిటల్ వేదికలు చట్టాలకు లోబడి పనిచేసేలా చూడాలి. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుతూ, నియంత్రణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా సమతుల్యత పాటించాలి. భారత్ ఆర్థికంగా, సాంకేతికంగా, వ్యూహాత్మకంగా బలపడటం దేశ ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే కాకుండా అంతర్జాతీయ వ్యవస్థలో దేశ స్వరాన్ని బలపరుస్తుంది. అందుకే దేశీయ పరిశ్రమల అభివృద్ధి, పరిశోధనలకు ప్రోత్సాహం, శక్తి రంగంలో స్వావలంబన, రక్షణ ఉత్పత్తుల తయారీ, డిజిటల్ మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూనే దేశీయ సంస్థలకు సమాన అవకాశాలు కల్పించాలి. కీలక సాంకేతికతల విషయంలో స్వదేశీ పరిశోధనలకు నిధులు పెంచాలి. ఒకే దేశం, ఒకే సంస్థ లేదా ఒకే సరఫరా వ్యవస్థపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలి. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేటప్పుడు తక్షణ లాభాలకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక ప్రభావాలను అంచనా వేయాలి. అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించడం భారత్‌కు అవసరమే. కానీ ఆ సంబంధాలు సమాన గౌరవం, పరస్పర ప్రయోజనాలు, జాతీయ సార్వభౌమత్వం అనే పునాదులపై ఉండాలి. విదేశాంగ విధానంలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కాపాడుకోవాలి. ప్రపంచంలోని ఇతర దేశాలతోనూ వాణిజ్య, సాంకేతిక సంబంధాలను విస్తరించాలి. ట్రంప్ రాజకీయ విధానాలను, మస్క్ వ్యాపార ప్రయోజనాలను విమర్శనాత్మకంగా పరిశీలించడం అంటే అమెరికాను శత్రువుగా చూడటం కాదు. విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించడం కూడా కాదు. దేశానికి లాభం చేకూర్చే సాంకేతికతను స్వీకరిస్తూనే, దాని వల్ల ఏర్పడే ఆధారపడే పరిస్థితులను గుర్తించి ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడమే వివేకం. భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవాలంటే భావోద్వేగాలకంటే వాస్తవాలు, ఆరోపణలకంటే ఆధారాలు, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకంటే దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విదేశీ శక్తుల ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తం చేయడం సులభం. కానీ ఆ అనుమానాలను నిర్ధారించే ఆధారాలను పరిశీలించడం, దేశ బలహీనతలను సరిదిద్దడం, ప్రజల ప్రయోజనాలను కాపాడటం అసలైన బాధ్యత.

భారత్‌ను బలహీనపరచగలిగేది బయటి ఒత్తిళ్లు మాత్రమే కాదు. దేశీయ విధానాల్లోని లోపాలు, సాంకేతిక ఆధారపడటం, ఆర్థిక అసమానతలు, పరిశోధనల పట్ల నిర్లక్ష్యం కూడా అంతే ప్రమాదకరం. అందుకే విదేశీ శక్తులపై నిందలు వేయడం కంటే దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలి. దేశ సార్వభౌమత్వం ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకూడదు. సాంకేతికతను ఎవరు అందిస్తున్నారన్నది మాత్రమే కాదు.. దానిపై నిర్ణయాధికారం ఎవరిదన్నదీ ముఖ్యం. వాణిజ్యం ఎంత పెరిగిందన్నదే కాదు.. ఆ వాణిజ్యంలో దేశానికి ఎంత స్వేచ్ఛ మిగిలిందన్నదీ ముఖ్యం. భారత్ తన ప్రయోజనాలను తానే కాపాడుకోగలిగినప్పుడే ఏ విదేశీ ఒత్తిడినైనా సమర్థంగా ఎదుర్కోగలదు.



రణధీర్ గుండు, హైదరాబాద్



ఎల్ నినో.. సర్కారు లేటు

ఎల్‌నినో ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు తగ్గితే వ్యవసాయం దెబ్బతింటుంది.. జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతాయి.. తాగునీటి సమస్య తీవ్రతరమవుతుంది.. విద్యుత్తు వినియోగం పెరిగి సరఫరాపైనా ఒత్తిడి ఏర్పడుతుంది. ఇవన్నీ ఒక్కరోజులో పరిష్కరించగలిగే సమస్యలు కావు. ముందస్తు ప్రణాళిక, సమన్వయం, నిరంతర పర్యవేక్షణ అవసరం.

విపత్తు ముంచుకొచ్చాక సమీక్షలు నిర్వహించడం కంటే, ముప్పు పొంచి ఉన్నప్పుడే కార్యాచరణకు దిగడం ప్రభుత్వ బాధ్యత. రైతులకు పంటలపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలి. సాగునీరు, తాగునీటి లభ్యతను అంచనా వేయాలి. ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం, విద్యుత్తు సరఫరాపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామస్థాయిలోనూ అప్రమత్తత పెంచాలి. ఇవన్నీ చివరి నిమిషంలో హడావుడిగా చేపడితే ఆశించిన ఫలితాలు రావు. ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందన్నది వాతావరణ అంచనాలపై ఆధారపడి ఉన్నా, సంసిద్ధతలో జాప్యానికి మాత్రం సమర్థన ఉండకూడదు. ప్రజల జీవనాధారాలు ప్రమాదంలో పడిన తర్వాత స్పందించడం పాలన కాదు.. ముందే మేల్కొని నష్టాన్ని నివారించడమే బాధ్యతాయుత పాలన. తెలంగాణ సర్కారు ఇప్పటికైనా రాజకీయ హడావుడిని పక్కనపెట్టి, ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనే కార్యాచరణను వేగవంతం చేయాలి. ప్రకృతి హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే.. ఆ మూల్యం చెల్లించేది రైతులు, పేదలు, సామాన్య ప్రజలే!



వినోద్ కుమార్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.